www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
12.02.2024
సంపుటి:2 సంచిక:121

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## అసెంబ్లీలో బిగ్‌ఫైట్‌కు
# కాంగ్రెస్ రెడీ

- నీటిపారుదల శాఖపై నేడు అసెంబ్లీలో వైట్ పేపర్ రిలీజ్
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇరిగేషన్ ప్రాజెక్టులపై ట్రైనింగ్
- ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజంటేషన్
- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు భట్టి, ఉత్తమ్
- పక్కా వ్యూహాలతో సిద్ధమవుతున్న అధికార పార్టీ
- ధీటుగా కౌంటర్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ ప్రతి వ్యూహాలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ అసెంబ్లీ వేదికగా నేడు హైవోల్టేజ్ ఫైట్ జరగబోతోంది. ఇరిగేషన్ ప్రాజెక్టులపై హోరాహోరీగా తలపడేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ రెడీ అయ్యాయి. మేడిగడ్డ సంఘటనతో బీఆర్ఎస్ ఇరుకున పెట్టేందుకు ప్రభుత్వం, కేఆర్ఎంబీ అంశంతో ఎదురుదాడికి బీఆర్ఎస్ వ్యూహ ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకున్నాయి. దీంతో సోమవారం అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాటర్‌వార్‌హీట్ ఖాయంగా కనిపిస్తోంది. ఇరిగేషన్‌పై నేడు ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయబోతోంది. ఆ తర్వాత ఇదే అంశంపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనుంది. దాంతో, ఇరిగేషన్ ప్రాజెక్టులపై హాట్ హాట్ డిస్కషన్స్ జరగనుంది. అందుకే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్‌మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదివారం ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నీటిపారుదల ప్రాజెక్టులపై బ్రీఫింగ్, ట్రైనింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్‌ను దీటుగా ఎలా ఎదుర్కోవాలి.. ఏ విధంగా చర్చించాలి అనే విషయాలపై ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి గైడెన్స్ ఇచ్చారు.

ఇదిలాఉంటే.. ప్రభుత్వానికి ధీటుగా కౌంటర్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ వ్యూహ ప్రతి వ్యూహాలతో సిద్ధమవుతోంది. మేడిగడ్డను చూడాలనుకుంటే మీరు చూడండి.. తమకవసరమేంటి

..మిగతా 2 లో




## 13న చలో ఢిల్లీ మార్చ్ పోలీస్ శాఖ అలర్ట్

- కనీస మద్దతు ధరే ప్రధాన డిమాండ్



# ఖాళీ అవుతున్న బీఆర్ఎస్!




### కాంగ్రెస్ టచ్ లో 22 మంది ఎమ్మెల్యేలు!


- వరుస షాకులతో టెన్షన్‌లో గులాబీ దళపతి
- కాంగ్రెస్ లో చేరేందుకు రెడీగా 'కారు పార్టీ' నేతలు
- పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఒక్కొక్కరుగా క్యూ..
- కూల్చుతామన్న కామెంట్లకు కాంగ్రెస్ కౌంటర్ ఎటాక్
- ఇప్పటికే పార్టీలో చేరిన ఎంపీ వెంకటేశ్, బాబా ఫసియుద్దీన్
- నేడో రేపో రాజయ్య, మహేందర్‌రెడ్డి, బొంతు రామ్మోహన్
- ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండడంతో 'కారు' డీలా

> గులాబీ దళపతికి వరుస షాకులు తగులుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల ముందే ఆ పార్టీ నేతలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ లో చేరుతున్నారు. బీఆర్ఎస్ తరఫున గతంలో గెలిచిన వారిలో చాలామంది కాంగ్రెస్ పూర్వ నాయకులే. వారందరూ ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామంటూ ప్రకటనలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలకు ఈ పరిణామం ఏమాత్రం మింగుడుపడని అంశంగా మారింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముందే చెప్పినట్లుగా బీఆర్ఎస్ పార్టీ నుంచి 22 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు టచ్ లో ఉన్నరేమోనని అనిపిస్తుంది. పైకి నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే అంటూ అధికార పార్టీ నేతలను కలుస్తున్నా.. విషయం వేరే ఉందని అర్థమవుతోంది. చాలా మంది బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీ గూటికి వచ్చేందుకు సిద్ధమైనట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇందులో సీనియర్ నుంచి జూనియర్ వరకు ఉన్నట్లు తెలుస్తోంది.

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎదురులేని కాంగ్రెస్ ఇప్పటికే ఒక్కొక్కరుగా కీలక నేతలు, సిట్టింగులు పార్టీని వీడుతుండడంతో 'కారు' డీలా పడ్డది. మరోవైపు ఇటీవల ఓ సర్వే సంస్థ తెలంగాణ కాంగ్రెస్ గాలికి ఎదురులేదని, గులాబీ, కమలం వాడిపోవడం ఖాయమని తేల్చింది. కాంగ్రెస్ లార్జెస్ట్ ఎంపీ సీట్లను గెలుచుకుంటుందని ప్రకటించింది. బీఆర్ఎస్, బీజేపీలు 3, 4 సీట్లతోనే సర్దుకోవాల్సిందేనని పేర్కొంది. దీంతో రెండు పార్టీలు పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా.. వాస్తవానికి 12సీట్లకే పరిమితం అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మొన్నటివరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరుసగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి.. హైకమాండ్‌కు షాక్ ఇవ్వగా.. అది తమ నియోజకవర్గ అభివృద్ధి కోసమేనని కవరింగ్ చేసుకున్నారు. అయితే.. ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న గులాబీ బాస్‌కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గట్టిగానే వార్నింగ్ ఇచ్చినా.. అదంతా ఉత్తదేనని స్పష్టమవుతున్నది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం గతంలో కేసీఆర్ ఉచ్చులో పడ్డ నేతలు తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి

..మిగతా 2 లో



## హైకోర్టు బిల్డింగ్‌పై కిస్సింగ్ సీన్స్..

- మాజీ స్పెషల్ జీపీ సంజీవ్ కుమార్ అంటూ ప్రచారం
- సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన వీడియో

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:** గత ప్రభుత్వంలో స్పెషల్ జీపీగా పని చేసిన సంజీవ్‌కుమార్‌కు సంబంధించిన ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో అడ్వకేట్ కోట్‌లో ఉన్న సంజీవ్‌కుమార్ హైకోర్టు బిల్డింగ్‌పై ఓ మహిళను

..మిగతా 2 లో



## బాల్క సుమన్ కు పోలీసుల నోటీసులు

- రేవంత్ రెడ్డిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎఫెక్ట్
- చెప్పుతో కొడతానంటూ కామెంట్స్

**విశాలభారతి,హైదరాబాద్:**

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంచిర్యాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి... ఇందులో భాగంగా ఆదివారం నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న సుమన్... వాటిపై సంతకం చేశారు. పోలీసుల నోటీసులపై బాల్క సుమన్ స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై మంచిర్యాల పోలీస్ స్టేషన్ లో అక్రమంగా కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఇందులో భాగంగానే మంచిర్యాల ఎస్సై కేసులకు సంబంధించి

..మిగతా 2 లో

## రాష్ట్రంలో భారీగా ఎంపీడీవోల బదిలీలు

- ఈసీ ఆదేశాల మేరకు 395 మంది ట్రాన్స్‌ఫర్
- త్వరలో మరికొన్ని శాఖల్లోనూ చేయనున్న ప్రభుత్వం

..మిగతా 2 లో



..మిగతా 2 లో

# యాదగిరిగుట్టపైకి ఆటోలు ప్రారంభం

- మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- జెండా ఊపి ఆటోలను ప్రారంభించిన బీర్ల అయిలయ్య
- గుట్టపైకి స్వయంగా ఆటో నడిపిన ప్రభుత్వ విప్..
- త్వరలో షాపులు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని హామీ

# కేసీఆర్ ముక్కు నేలకు రాసి నల్గొండకు రావాలె

- దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చినవ్..
- ఏ ముఖం పెట్టుకుని నల్గొండకు వస్తున్నవ్?
- కాంగ్రెస్‌బడ్జెట్‌ను విమర్శించే వారంతా మూర్ఖులే..
- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫైర్
- పార్టీలకతీతంగా బీఆర్ఎస్‌మీటింగ్ ను బహిష్కరించాలె
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



> రాష్ట్రంలో కృష్ణా రివర్ వాటర్ వార్ రాజకీయాలను హీటెక్కిస్తోంది. కేఆర్ఎంబీకి 'కృష్ణా' ప్రాజెక్టులను అప్పగించడంలో మీరంటే.. మీరే కారణమంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. కృష్ణా జలాల పరిరక్షణ ధ్యేయంగా బీఆర్ఎస్ ఈ నెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభను తలపెట్టింది. ఈ నేపథ్యంలో 'ఛలో నల్లగొండ' సభపై కోమటిరెడ్డి బ్రదర్స్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియా సమావేశంలో బీఆర్ఎస్‌చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ పై విరుచుకుపడ్డారు. నల్గొండకు తీరని అన్యాయం చేసిన కేసీఆర్ ఏ మొహంపెట్టుకొని వస్తున్నావని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. ముక్కు నేలకు రాసి నల్గొండ ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే రావాలని ఆయన డిమాండ్ చేశారు.

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

**దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చినవ్..**

దక్షిణ తెలంగాణను ఎడారి చేసింది.. కేసీఆరేనని కోమటిరెడ్డి విమర్శించారు. కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు లేదన్నారు. ఈ నెల 13న నల్లగొండ పట్టణ చౌరస్తాల్లో కేసీఆర్ మాటతప్పడంపై వినూత్న రీతిలో నిరసన తెలుపుతామన్నారు. పోలీసుల పర్మిషన్‌తో కేసీఆర్ కోసం చైర్, పింక్ టవల్ ఎల్ఈడీ స్క్రీన్‌పెట్టి నల్గొండ రైతులతో నిరసన తెలుపుతామని కోమటిరెడ్డి తెలిపారు. మునిగిపోయే ప్రాజెక్టులు కట్టి లక్షల కోట్లు దోచుకున్నారని, జగన్‌తో.. కేసీఆర్ కుమ్మకు రాజకీయాలు చేసి కృష్ణా జలాలను ఏపీకి ధారాదత్తం చేశారని విమర్శించారు. కృష్ణాజలాలపై కేసీఆర్ దొంగ దీక్షలు చేసి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని కోమటిరెడ్డి ఫైర్‌అయ్యారు. కృష్ణా జలాలపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్ లేదని మంత్రి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ బడ్జెట్‌ను విమర్శించే వారంతా మూర్ఖులేనని కామెంట్ చేశారు. బడ్జెట్‌ను విమర్శిస్తున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను ప్రజలు అసహ్యించుకున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పులు మిగిల్చి వెళితే.. బడ్జెట్ లో 13 శాతం అప్పుల చెల్లింపులకే పోతుందన్నారు. గత ప్రభుత్వం అంకెలు, మాటల గారడీతో కాలం

..మిగతా 2 లో




..మిగతా 2 లో

# బీజేపీ విజయ సంకల్ప యాత్రలు

- తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్‌తోనే పోటీ
- హైదరాబాద్ఎంపీ స్థానం గెలిచి తీరుతాం
- బీజేపీ స్టేట్‌చీఫ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily
సోమవారం,
12.02.2024
హైదరాబాద్





# అసెంబ్లీలో బిగ్‌ఫైట్‌కు కాంగ్రెస్ రెడీ

మొదటిపేజీ తరువాయి

అంటున్నారు గులాబీ నేతలు. కాళేశ్వరం కట్టిందే మేము .. మేం కట్టిన ప్రాజెక్ట్‌ను మాకే చూపిస్తారా? అంటూ సెటైర్లు వేస్తున్నారు. అసలు, కాళేశ్వరం గురించి కాంగ్రెసోళ్లకు అ.. ఆలు కూడా తెలియదని కేటీఆర్‌కామెంట్‌చేస్తున్నారు. మేడిగడ్డకు రావాలన్న రేవంత్ ఆహ్వానంపైనా కేటీఆర్ సెటైర్లు వేశారు. ఇలా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ హైవోల్టేజ్ వార్‌కు రెడీ అవుతున్న నేపథ్యంలో తెలంగాణ రాజకీయాలు మరింత హీటెక్కాయి.. మేడిగడ్డ ఇష్యూతో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ ఇరుకున పెడుతుందా..? లేక కేఆర్ఎంబీ అంశంతో బీఆర్ఎస్ .. ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తుందా..? అనేది ఆసక్తికరంగా మారింది.

# 13న చలో ఢిల్లీ మార్చ్ పోలీస్ శాఖ అలర్ట్

**- కనీస మద్దతు ధరే ప్రధాన డిమాండ్**

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రైతులు చేపట్టిన నిరసనలు ఉద్ధృతంగా మారుతున్నాయి. 200 రైతు సంఘాలు ఫిబ్రవరి 13న 'ఢిల్లీ చలో' మార్చ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అప్రమత్తమైన హర్యానా పోలీసులు అత్యవసరమైతే తప్ప రహదారులపైకి ప్రజలు రాకూడదని హెచ్చరికలు జారీ చేశారు. శాంతిభద్రతలను కాపాడటానికి పంచకులలో 144 సెక్షన్‌ని అమలు చేశారు. రైతుల పాదయాత్ర నేపథ్యంలో ఢిల్లీ పోలీసులూ అప్రమత్తం అయ్యారు. అన్ని సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. హరియాణా, పంజాబ్ రైతులు ఢిల్లీ సరిహద్దుకు రాకుండా ఆయా ప్రాంతాల్లో క్రేన్లు, కంటైనర్లను మోహరించారు.

**డిమాండ్లివే..**

పంటలకు కనీస మద్దతు ధర కల్పించే చట్టం తేవడంతో పాటు రైతాంగాన్ని వేధిస్తున్న పలు సమస్యలను పరిష్కరించాలని కర్షకులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల నుంచి వివిధ అభివృద్ధి పనుల కోసం తీసుకున్న భూములను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. లోక్‌సభ ఎన్నికలలోపు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి హామీల అమలు జరిగేలా ప్రయత్నించాలని చూస్తున్నారు.ఇందులో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చాతో సహా రైతు సంఘాలు మార్చ్‌కు పిలుపునిచ్చాయి. ఇదిలా ఉండగా.. ఓ వైపు కేంద్ర ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానిస్తుండగా.. మరోవైపు హరియాణా ప్రభుత్వం రైతులను భయభ్రాంతులకు గురిచేస్తోందని రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ఆరోపించారు.

# హైకోర్టు బిల్డింగ్‌పై కిస్సింగ్ సీన్స్..

మొదటిపేజీ తరువాయి

కిస్‌చేస్తూ కనిపించారు. న్యాయవాదిగా ఉంటూ హైకోర్టు భవనంపైనే ఇలాంటి అసభ్యకరమైన కార్యకలాపాలకు పాల్పడడంపై అతనిపై సోషల్‌మీడియాలో తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంజీవ్‌కుమార్‌ఐదు నెలల కిందట ఓ యువతిని ముద్దాడారంటూ చెబుతున్నారు. 5 నెలల కిందట జరిగిన సదరు సంఘటన ఇప్పుడు వైరల్ అవుతుండడంతో.. వీడియోకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై న్యాయవాదుల కంప్లైంట్స్ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్‌ఏజీ సంజీవ్ కుమార్ ను జడ్జి ప్యానల్ తొలగించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా స్టెనో పదవి నుంచి మహిళా ఉద్యోగిని కూడా తొలగించారని అడ్వకేట్లు చెప్తున్నారు.

# బాల్క సుమన్ కు పోలీసుల నోటీసులు

మొదటిపేజీ తరువాయి

నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించారు. ఉద్యమంలో ఎన్నో కేసులు ఎదుర్కొని పోరాడిన పార్టీ తమదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడతానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘాటైన పదజాలంతో దూషిస్తూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు నిరసనలు తెలిపాయి. మంచిర్యాల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడిన సుమన్... కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు రేవంత్ రెడ్డిపైనా ఘాటుగా మాట్లాడారు. రేవంత్ రెడ్డిని విమర్శించిన కేసీఆర్.. చెప్పు చూపి కొడతారని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేశారు. ఇందులో భాగంగా... మంచర్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. సుమన్ వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు సమర్థిస్తున్నారు. తమ నేతను అసభ్య పదజాలంతో దూషించిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ముందుగా రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని అంటున్నారు. ప్రతి చర్యకు ఒక చర్య ఉన్నట్లుగా కౌంటర్ ఇచ్చారు.



# యాదగిరిగుట్టపైకి ఆటోలు ప్రారంభం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఆటోలను కొండపైకి అనుమతిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని నెరవేరుస్తూ.. ఆదివారం యాదగిరిగుట్ట కొండపైకి ఆటోలను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ.. యాదాద్రి కొండపై మెరుగైన వసతి సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. యాదాద్రి టెంపుల్ అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వం వెయ్యికి పైగా కుటుంబాలను రోడ్డున పడేసిందన్నారు. నాలుగేండ్లుగా ఆటోలకు అనుమతి ఇవ్వకపోవడంతో ఉపాధి కోల్పోయారన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం యాదాద్రి కొండపైకి ఆటోలకు వెంటనే అనుమతిచ్చిందని తెలిపారు. త్వరలోనే కొండపై దుకాణాలు కోల్పోయిన వాళ్లకూ న్యాయం చేస్తామని అయిలయ్య హామీ ఇచ్చారు.

**20 నెలల పాటు ఆటోడ్రైవర్ల దీక్షలు**

యాదగిరిగుట్ట ప్రధానాలయం రీ ఓపెన్ సందర్భంగా గత ప్రభుత్వం.. 2022 మార్చి 28న కొండపైకి ఆటోలను నిషేధించింది. దీంతో ఆటో డ్రైవర్లు రిలే నిరాహార దీక్షలకు దిగారు. ఘాట్ రోడ్డు సమీపంలో యాదరుషి విగ్రహం వద్ద దాదాపుగా 20 నెలల పాటు దీక్షలు కొనసాగించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పోలీసుల సూచన మేరకు 2023 నవంబర్‌లో దీక్షలు విరమించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడంతో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆటో డ్రైవర్లు, ఆలయ ఉద్యోగులు, పోలీసులతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. సాధ్యాసాధ్యాలపై అధికారులతో సమీక్షించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఫిబ్రవరి 11 నుంచి కొండపైకి ఆటోలను అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆటో డ్రైవర్ల రెండు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది.

**ఆటోడ్రైవర్ బీర్ల అయిలయ్య..!**

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆటోడ్రైవర్‌గా మారిపోయారు. ఆదివారం యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి గుట్టపైకి ఆటోలు ప్రారంభించిన అనంతరం ఆటో నడిపారు. యాదాద్రి డీసీపీ రాజేశ్ చంద్ర, ఆలయ ఈవో రామకృష్ణారావులను ఆటోలో ఎక్కించుకుని గుట్టపైకి తీసుకెళ్లారు.

# ఖాళీ అవుతున్న బీఆర్ఎస్!

మొదటిపేజీ తరువాయి

వచ్చి తమ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నట్లు తెలుస్తోంది.

**కాంగ్రెస్ కండువా కప్పకోవడం లాంఛనమే**

ఇటీవల బీఆర్ఎస్ నుంచి సుమారు 20 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ జగ్గారెడ్డి చెప్పడం కూడా త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందన్న సంకేతాలను ఇస్తుంది. ఈ క్రమంలోనే.. సీఎంను 'పట్నం' కుటుంబం కలవడం, గ్రేటర్‌హైదరబాద్‌తొలి డిప్యూటీ మేయర్‌బాబా ఫసియుద్దీన్ కాంగ్రెస్ కండువా కప్పుకోవడం, మేయర్ బొంతు రామ్మోహన్ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలవడం హాట్ టాఫిక్‌గా మారింది. ఇప్పటికే గులాబీ పార్టీలో కేసీఆర్ ఫ్యామిలీ తప్ప మిగతా నేతలు కాంగ్రెస్ నేతలు, హైకమాండ్‌తో సంప్రదింపులు కూడా పూర్తి చేసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ హైకమాండ్‌నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే కండువా కప్పుకోవడం లాంఛనమేనని ప్రచారం జరుగుతోంది.

**కాంగ్రెస్‌లోకి వెళితే..?**

అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ టికెట్ ఆశించి భంగపడ్డ బొంతు రామ్మోహన్ నాటి నుంచి పార్టీతో అంటీ ముట్టనట్లుగానే ఉంటూ వస్తున్నారు. అప్పట్లోనే పార్టీ మారుతారని ప్రచారం జరిగినప్పటికీ జంప్ చేసినా ఎక్కడా ఉప్పల్ టికెట్ ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో మిన్నకుండిపోయారు. అయితే పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతుండడంతో మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేయడానికి బొంతు సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్‌లో కూడా ఈ నియోజకవర్గానికి గట్టిపోటీనే ఉంది. అయితే.. బీఆర్ఎస్‌లో మల్కాజ్‌గిరి టికెట్ కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి కర్చీఫ్ వేసుకుని కూర్చున్నారు. తన కుమారుడిని పోటీ చేయించాలని ప్లాన్‌లో ఉన్నారు. దీంతో టికెట్ అడిగినా ఇచ్చే పరిస్థితి లేదని.. అటు ఎమ్మెల్యే .. ఇటు ఎంపీ టికెట్ లేకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనైన రామ్మోహన్ ఇక పార్టీలో ఉండి ఫలితం లేదని కాంగ్రెస్‌లో చేరాలని అనుచరులతో చర్చించి నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రేటర్‌పై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగానే సిటీకి చెందిన బీఆర్ఎస్ ముఖ్యనేతలు, కార్పొరేటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

**నిన్న బాబా ఫసయుద్దీన్.. నేడు బొంతు!**

భాగ్యనగర గులాబీ పార్టీలో సుదీర్ఘకాలంగా క్రియాశీల కార్యకర్తగా, నేతగా కొనసాగుతున్న మాజీ డిప్యూటీ మేయర్, ప్రస్తుత బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఇటీవలే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి 'హస్తం' గూటికి చేరిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. 2022లో విద్యార్థి దశలో ఉన్న సమయంలో తెలంగాణ ఏర్పాటు అంశం తెరమీదకు వచ్చినప్పుడు ఆకర్షితుడైన ఫసియుద్దీన్ అందులో చేరారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్‌గా కూడా పదవీ బాధ్యతలు చేపట్టారు. 22 ఏళ్లుగా పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నప్పటికీ.. అగ్రనాయకులు తనను పట్టించుకోవడం లేదని ఆవేదనకు గురైన బాబా ఫసియుద్దీన్ బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఈయన చేరిన రోజుల వ్యవధిలోనే బొంతు రామ్మోహన్ కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోబోతున్నారు.



**బీఆర్ఎస్‌కు బొంతు రామ్మోహన్‌గుడ్‌బై!**

**జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్, బీఆర్ఎస్ కీలక నేత బొంతు రామ్మోహన్ 'కారు' పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నారు. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డితో రామ్మోహన్ భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరికపై సీఎంతో చర్చించారు. త్వరలోనే తన అనుచరులు, నియోజకవర్గ నేతలతో కలిసి 'కారు' దిగి కాంగ్రెస్ కండువా కప్పకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. కాగా.. బీఆర్ఎస్ మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బొంతు రామ్మోహన్.. జీహెచ్‌ఎంసీ మేయర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే**



# కేసీఆర్ ముక్కు నేలకు రాసి నల్గొండకు రావాలె

మొదటిపేజీ తరువాయి

వెల్లడీసిందన్నారు. తాము ప్రవేశపెట్టిన బడ్జెట్ గొప్పగా ఉందన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు సూపర్ గేమ్ ఛేంజర్‌గా, తెలంగాణకు తలమానికంగా మారుతుందన్నారు. మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ వల్లే ఆర్ఆర్ఆర్ ఆలస్యమైందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డపై చర్చావేదికలో అందరూ పాల్గొనాలని కోమటిరెడ్డి కోరారు.

**పార్టీల కతీతంగా బీఆర్ఎస్‌సభను బహిష్కరించండి**

మరోవైపు, కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేందుకు కేసీఆర్ సంతకం చేశారని.. ఇప్పుడు కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణకు ఇంతకంటే ద్రోహం మరొకటి ఉంటుందా? అని ప్రశ్నించారు. ఆదివారం ఆయన మునుగోడులో మీడియా సమావేశంలో మాట్లాడారు. దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చి.. ఇప్పుడు మళ్లీ సెంటిమెంట్ రెచ్చగొట్టేందుకు కేసీఆర్.. నల్గొండలో సభ పెడుతున్నారన్నారు. కేసీఆర్ నల్గొండ సభను పార్టీలకు అతీతంగా ప్రజలంతా బహిష్కరించాలని రాజగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రాజెక్టులు పూర్తి చేయకుండా పదేండ్ల తర్వాత ఏ ముఖం పెట్టుకుని నల్గొండకు వస్తున్నాడో చెప్పాలన్నారు.



# బీజేపీ విజయ సంకల్ప యాత్రలు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఈ నెల 20 నుంచి బీజేపీ విజయ సంకల్ప యాత్రలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకి దేశ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సానుకూల వాతావరణం ఉందన్నారు. ప్రజలు ప్రధాని నరేంద్ర మోడీకి కమలం పువ్వుకు ఓటేసెందుకు ముందే నిర్ణయం తీసుకున్నారని, తెలంగాణ లో బీజేపీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందన్నారు. తెలంగాణ ప్రజల మద్దతు, ఆశీస్సుల కోసం 5 యాత్రలు నిర్వహించాలని, ఫిబ్రవరి 20 నుంచి మార్చి 1వరకు యాత్రలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 5 పార్లమెంట్ క్లస్టర్ లలో 5 విజయ సంకల్ప యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రలకు క్లస్టర్ వారీగా పేర్లు పెట్టినట్లు, భువనగిరి, మల్కాజ్ గిరి, సికింద్రాబాద్ , హైదారాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్ర కి 'భాగ్య నగరం' అని పేరును ఖరారు చేసినట్లు తెలిపారు. కరీంనగర్ , మెదక్ , జహీరాబాద్, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్రకు 'శాతవాహన' అని, అదిలాబాద్, పెద్దపల్లి, నిజమాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్రకు 'కొమురం భీమ్' అని పేరును నిర్ణయించినట్లు వెల్లడించారు.

వీటితో పాటు 'మహబూబ్ నగర్, నాగర కర్నూల్, నల్గొండ పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్రకు 'కృష్ణమ్మ' అని, ఖమ్మం, వరంగల్, మహబూబ్ బాద్ పార్లమెంట్ పరిధిలో జరిగే యాత్ర 'కాకతీయ' అని పేర్లను పెట్టారు. రోజూ 2, 3 అసెంబ్లీ లని ఒక్కో యాత్ర కవర్ చేస్తుందని, ముఖ్య నేతలు అందరూ అన్ని యాత్రల్లో పాల్గొంటారన్నారు. ఈ యాత్రల సందర్భంగా ఎక్కువ రోడ్ షో లు ఉంటాయన్నారు కిషన్ రెడ్డి. అన్ని యాత్రలు హైదరాబాద్ లో ముగిసే విధంగా ప్లాన్ చేస్తున్నామని, హైదరాబాద్ పార్లమెంట్ లో గెలిచేందుకు పోటీ చేసి, ఎంఐఎంను మట్టి కరిపిస్తామన్నారు. చాలా రాష్ట్రాల్లో బీజేపీ కి కాంగ్రెస్ పోటీ కాదని, తెలంగాణ లో బీజేపీకి పోటీ కాంగ్రెస్ అని భావిస్తున్నామన్నారు. ఖమ్మం, నల్గొండ లలో కూడా బీజేపీ కి సానుకూల వాతావరణం ఉందని, కుటుంబ, అవినీతి పార్టీల కి నీతి కోసం ధర్మం కోసం పని చేస్తున్న బీజేపీ కి మధ్య పోటీ అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. 'ఈ ఎన్నికలు దేశం కోసం, దేశ అభివృద్ధి కోసం. సుస్థిరతకు అస్థిరత కు మధ్య జరుగుతున్న ఎన్నికలు.. రేపు బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ, రాష్ట్ర ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ మీటింగ్ లు ఉన్నాయి. మేడిగడ్డ కు మేము ఇంతకు ముందే వెళ్లి వచ్చాం. వాళ్లతో వెళ్లాల్సిన అవసరం లేదు. కేఆర్ఎంబీపై ఏపీ , తెలంగాణ కూర్చొని మాట్లాడుకోవాలి. మా స్టాండ్ ఏందో అసెంబ్లీ లో, అసెంబ్లీ బయట చెబుతాం.' అని కిషన్ రెడ్డి అన్నారు.

# రాష్ట్రంలో భారీగా ఎంపీడీవోల బదిలీలు

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో భారీగా ఎంపీడీవోల ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే.. శనివారం డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బదిలీ చేసిన సర్కార్‌తాజాగా ఎంపీడీవోలను బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సేవలందిస్తున్న 395 మంది ఎంపీడీవోలను ట్రాన్స్‌ఫర్‌చేస్తూ ఆర్డర్స్ జారీ చేసింది. సొంత జిల్లాల్లో పని చేస్తున్న వారితో పాటు మూడేండ్లకు పైగా ఒకేచోట పని చేస్తున్న ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని గతేడాది డిసెంబర్‌లో ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈసీ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వం మండల అధికారులను బదిలీ చేసింది . ఇదిలా ఉండగా.. శనివారం ప్రభుత్వం 32 మంది డిప్యూటీ కలెక్టర్లతో పాటు 132 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీజోన్-1లో 84 మంది తహసీల్దార్లు, మల్టీజోన్2లో 48 మంది తహసీల్దార్లను బదిలీ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, రాబోయే రోజుల్లో మరికొన్ని శాఖల్లోనూ అధికారుల బదిలీలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.



నల్గొండ లోని అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర రోడ్లు,భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాటు జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మున్సిపల్ చైర్ పర్సన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

# 'ఎమ్మెస్‌కే అకాడమీ' లో మంచి క్రికెటర్లుగా ఎదగాలి

- టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్
- తన యుక్త వయస్సులో మంచి క్రికెటర్ అని వెల్లడి




**విశాల భారతి, సిటీ బ్యూరో:** 'ఎమ్మెస్ కే ప్రసాద్ వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి చీఫ్‌గెస్ట్‌గా టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఉద్యమకారుడు సేవారత్న డాక్టర్. ఎస్. ఎం.హుస్సేని (ముజీబ్) హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. యంగ్‌ఏజ్‌లో తాను క్రికెట్ బాగా ఆడేవాడినని అన్నారు. ఎన్నో టోర్నమెంట్స్‌లో పాల్గొని తమ జట్టులో మంచి బ్యాట్స్‌మెన్‌గా పేరు తెచ్చుకున్నానన్నారు. ఈ క్రీడాకారులను చూస్తే నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. అలాగే ఎమ్మెస్ కే ప్రసాద్ గారి ఆధ్వర్యంలో క్రికెట్ ఆటలు నేర్చుకుంటున్న యువకులకు రానున్న రోజుల్లో మంచి భవిష్యత్‌ఉంటుందన్నారు. మంచి క్రీడాకారులుగా ఎదిగి ఇటు రాష్ట్రానికి అటు భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలని ముజీబ్‌ఆశాభావం వ్యక్తం చేశారు. తనను చీఫ్‌గెస్ట్‌గా ఆహ్వానించిన ఎమ్మెస్ కే ప్రసాద్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



# రండి.. చూసుకుందాం : షర్మిల

- నగరిలో రోజాపై నిప్పులు చెరిగిన షర్మిల
- రోజమ్మా.. నోరుంది కదా అని పారేసుకోవద్దు
- ఒక్క నిమిషం నేను రాజశేఖర్ రెడ్డి బిడ్డను కాదనుకుంటాను

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల నేడు నగరిలో రోడ్ షోనిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలకు ఘాటు హెచ్చరికలు చేశారు. లోకల్ ఎమ్మెల్యే, మంత్రి రోజాపైనా ఆమె విరుచుకుపడ్డారు. "రోజమ్మా నోరుంది కదా అని పారేసుకోవద్దు. పక్క రాష్ట్రంలో మొన్నటి వరకు నాపై నోరు పారేసుకున్న వారందరూ ఓడిపోయి ఇళ్లలో కూర్చున్నారు. రేపు మీ పరిస్థితి కూడా అంతే అని స్పష్టం చేశారు. ఇంకొకరు నేను రాజశేఖర్ రెడ్డి బిడ్డను కాబట్టి బాపట్ల నుంచి అవతలికి అడుగుపెట్టనిచ్చాం అని అంటున్నారు. ఒక్క నిమిషం నేను రాజశేఖర్ రెడ్డి బిడ్డను కాదనుకుందాం... రండి, ఎంతమంది వస్తారో రండి.. చూసుకుందాం. ఏం చేస్తారో చేయండి. మీ దమ్మేందో చూపించండి. సిగ్గుండాలి కదా. రాజశేఖర్ రెడ్డి పేరుతో, రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసం నిలబడ్డామని చెప్పుకుంటూ ఇంత దయనీయంగా, ఇంత దరిద్రంగా ఆడ, మగ తేడా లేకుండా నీచంగా వ్యవహరించారు. ఈ ఐదేళ్లలో అన్ని మాటలు తప్పారు. రాజశేఖర్ రెడ్డి సంక్షేమ పాలనకు, జగనన్న పాలనకు పోలికే లేదు. ప్రతి మాట తప్పారు. ఇప్పుడు నేనొచ్చి ఇక్కడ తప్పులను ఎత్తిచూపుతున్నాని, చెల్లెల్ని అనే ఇంగితం లేకుండా వ్యవహరిస్తున్నారు. 3,200 కిలో మీటర్లు పాదయాత్ర చేసి ఇదే పార్టీ (వైసీపీ)ని నేను నా భుజాల మీద మోశాను. సమైక్యాంధ్ర కోసం తిరిగాను, ఓదార్పు యాత్ర చేశాను, బై బై బాబు క్యాంపెయిన్ చేశాను. ఎక్కడ అవసరం వస్తే అక్కడ నా సేవలు అందించాను. నాకు ఈ పదవి కావాలి అని అడగలేదు. ఆ పార్టీ (వైసీపీ) ఓ మొక్కగా ఉన్నప్పుడు నా చేతులతో నీళ్లు పోశాను, ఎరువు వేశాను, కాపాడాను. ఇప్పుడా పార్టీ ఓ చెట్టు అయింది. చెట్టయ్యాక నా అవసరమే లేదంటున్నారు కదా! మీ మాటలతో మీ అహంకారం ఎంతో తెలుస్తోంది. ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. మళ్లీ చెబుతున్నా... నేను ప్రజల కోసమే వచ్చాను" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# కాంగ్రెస్‌లో ఫుల్ జోష్.. టికెట్ల కోసం పోటా పోటీ..!

- 175 అసెంబ్లీ స్థానాలకు 793 అప్లికేషన్లు
- షర్మిలతో పార్టీలో నూతన ఉత్సాహం
- ఆంధ్రరత్న భవన్‌కు 105 అప్లికేషన్లు
- పార్టీలో యాక్టివ్ గా సీనియర్లు


**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:**



రాష్ట్ర విభజన తర్వాత ఏపీ కాంగ్రెస్‌లో అలికిడే కనిపించలేదు. ఉన్న నేతలు కూడా ఎన్నికలు, టికెట్లు అంటే ఆమడ దూరం పారిపోయేవారు. పదేళ్లు తిరిగే సరికి పరిస్థితి మారిపోయింది. వైఎస్ షర్మిల పీసీసీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి హడావుడి మొదలైంది. తాజాగా ఏఐసీసీ ఆదేశాలతో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణికం ఠాగూర్ టికెట్ ఆశావహుల దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175, అసెంబ్లీ 25 లోక్‌సభ స్థానాలకు వందల్లో అప్లికేషన్లు వచ్చి పడుతున్నాయి. ఒక్కో అసెంబ్లీ, ఎంపీ స్థానం నుంచి పదుల సంఖ్యలో అప్లికేషన్లు బెజవాడలోని ఆంధ్రరత్న భవన్‌కు చేరుతున్నాయి. ఆ కోలాహలంతో దరఖాస్తుల స్క్రూటినీ కాంగ్రెస్ పెద్దలకు తలనొప్పిగా తయారైందంట. ఏపీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి .. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. ఇంతకాలం రాష్ట్రంలో నిశ్శబ్దంగా ఉన్న కాంగ్రెస్ నేతలంతా ఎన్నికల్లో తాము పోటీ చేస్తామంటే .. తాము పోటీ చేస్తామంటూ ముందుకు వస్తున్నారు. కార్యకర్తల నుంచి కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకున్న సీనియర్ల వరకు రాబోయే ఎన్నికల్లో ఆయా సెగ్మెంట్ల నుంచి పోటీ చేస్తామని అప్లికేషన్లు పెట్టుకుంటున్నారు . హైకమాండ్ ఆదేశాల మేరకు మాణికం ఠాగూర్ ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు గేట్లు తెరిచారు. దాంతో విజయవాడలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌కి ధరఖాస్తుల తాకిడి పెరిగిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత రెండు సార్లు జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులే దొరకలేదు కాంగ్రెస్‌కి. చాలా చోట్లు ఎవరికి పడితే వారికి టికెట్లు ఇచ్చి .. పోటీలో ఉన్నామంటే ఉన్నాం అనిపించుకుంది. అప్పట్లో ప్రచార మెటీరియల్ తీసుకెళ్లడానికి కూడా నేతలు, కార్యకర్తలు లేక పార్టీ కార్యాలయం బోసిపోయి కనిపించేది. వైఎస్ షర్మిల పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక.. గతంలో పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన నాయకులు, కార్యకర్తలంతా యాక్టివ్ అయ్యారు. చాలాకాలం పొలిటికల్ స్క్రీన్‌పై కనిపించని మాజీ కేంద్ర మంత్రులు జెడి శీలం, పల్లంరాజులతో పాటు కేవీపీ రామచంద్రరావు, శైలజానాథ్, రఘువీరా రెడ్డి, తులసి రెడ్డి, గిడుగు రుద్రరాజు , మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ లాంటి సీనియర్ నేతలంతా షర్మిల వెన్నంటే ఉంటుండటం, కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపుతోంది. దాదాపు 15 రోజుల వ్యవధిలో 175 అసెంబ్లీ స్థానాలకు 793 అప్లికేషన్లు ,25 పార్లమెంట్ స్థానాలకు 105 అప్లికేషన్లు ఆంధ్రరత్న భవన్‌కు చేరాయి. అప్లికేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుండటంతో .. టికెట్ ఆశావహులు పెద్ద ఎత్తున్న విజయవాడ తరలివస్తున్నారు. ఇప్పటికిప్పుడు పూర్వవైభవం పొందే పరిస్థితి లేకపోయినా .. ప్రస్తుత దరఖాస్తుల కోలాహలంతో .. పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగి .. ఏపీలో పూర్తిగా చతికిల పడ్డ కాంగ్రెస్ .. ఎన్నికల రేసులో పరిగెత్తడానికి రెడీ అయిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# నన్ను చెప్పుతో కొట్టండి

- ఆగ్రహం వ్యక్తం చేసిన బాలినేని శ్రీనివాస్ రెడ్డి
- నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు
- 231 కోట్లతో పేదలకు 25 వేల పట్టాలు పంపిణీ చేశాను



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** ఒంగోలులో 25 వేల మంది పేదలకు పట్టాలు పంపిణీ చేస్తుంటే అవినీతికి పాల్పడుతున్నట్టు ప్రచారం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను అవినీతికి పాల్పడినట్టు తేలితే తనను చెప్పుతో కొట్టాలని ఆవేశంతో అన్నారు. అలాగే పేదలకు పట్టాలు పంపిణీ చేయకుండా ప్రయత్నిస్తే వారి సంగతి తేలుస్తానన్నారు. ఒంగోలులో 231 కోట్లతో పేదలకు 25 వేల పట్టాలు పంపిణీ చేయడం కోసం అధికారులతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ఖండించారు. అగ్రహారం దగ్గర లే అవుట్ ను పరిశీలించారు. పేదల పట్టాల పంపిణీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే బాలినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాలు పంపిణీ చేయలేకపోతే ఎన్నికల్లో పోటీ చేయనని భీష్మించానని, తన రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్నానని తెలిపారు. పట్టాలు పంపిణీ చేయడాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారి ఆఫీసును 75వేల మంది లబ్దిదారులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా ఫర్వాలేదన్నారు. సీఎం ఊరుకున్నా, తాను ఊరుకోనని తెలిపారు. ఈనెల 20 నుంచి 25వ తేది లోపు సీఎం చేతుల మీదుగా 25 వేలమందికి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. పట్టాలతో పాటు ఇళ్ళ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీ టౌన్ షిప్‌లా అభివృద్ధి చేస్తామని బాలినేని హామీ ఇచ్చారు.

# దమ్ముంటే చంద్రబాబు, మోడీ, జగన్ నాపై పోటీ చేయాలి




- ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు
- నన్ను ఓడించడానికి 1200 కోట్లు ఖర్చు చేస్తున్నారు
- వచ్చే ఎన్నికల్లో వైజాగ్ నుంచి పోటీ చేస్తాను

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను వైజాగ్ నుంచి పోటీ చేస్తున్నానని.. తనను గెలిపించండని కోరారు. తనను ఓడించడానికి పురందేశ్వరికి, జీవీఎల్ కు రూ. 1200 కోట్లు ఖర్చు చేయమని మోడీ చెప్పారని తెలిపారు. మరోవైపు.. వైజాగ్ లో వెయ్యి కోట్లు ఖర్చుచేసి తనను ఓడించాలని బొత్స సత్యనారాయణ చూస్తున్నాడని ఆరోపించారు. దమ్ముంటే చంద్రబాబు, మోడీ, జగన్ తనపై వైజాగ్ లో పోటీ చేయాలని సవాల్ చేశారు. రెండు నెలల క్రితం జేడీ లక్ష్మీనారాయణను కలిశానని జేడీని తనతో కలిసి రమ్మని అడిగినట్లు పేర్కొన్నారు. కానీ ఆయన తనను వెయ్యి కోట్లు అడిగారని కేఏ పాల్ చెప్పారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేఏ పాల్ అన్నారు. బాలయోగికి ఎందుకు భారతరత్న ఇవ్వలేదు ? అని ప్రశ్నించారు. తనకు భారతరత్న ఇస్తానన్నారు.. కానీ తానే తీసుకోలేదని చెప్పారు. మరోవైపు పవన్ కల్యాణ్ కేఏ పాల్ తీవ్ర విమర్శలు చేశారు. తమ్ముడు పవన్ కళ్యాణ్ నీకెందుకు ఈ ఖర్మ.. మెగా బ్రదర్స్ ప్రజారాజ్యం పేరుతో మంచి పార్టీ పెట్టారు. అందర్నీ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీలో కలిపేశారని విమర్శించారు. 20 సీట్లు తీసుకోవడానికి మేం కుక్కలమా అన్నావని మరెందుకు ఇప్పుడు పాతిక సీట్ల కోసం పాకులాడుతున్నావ్..? అని ప్రశ్నించారు. చిరంజీవి ప్యాకేజ్ స్టార్ కాబట్టే పద్మభూషణ్ , పద్మవిభూషణ్ అవార్డులు ఇచ్చారని అన్నారు. చంద్రబాబుకు బిల్ గేట్స్‌ను పరిచయం చేసింది తానేనన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు ఈ నిజాన్ని ప్రజలకు చెప్పాలని తెలిపారు. మరోవైపు.. తనను చంపడానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ తనను కొట్టించారన్నారు. వారు చిత్తుచిత్తుగా ఓడిపోతారని చెప్పా ఎన్నికల్లో ఓడిపోయారని పేర్కొన్నారు. తనకు చావంటే భయం లేదని.. చావుకే తానంటే భయమని అన్నారు. ఏపీలో పార్టీలన్నీ మోడీ తొత్తులేనని విమర్శించారు. పురందేశ్వరి చాలా మంచి వ్యక్తి.. ఆమె కూడా మోడీకి అమ్ముడు పోయిందని ఆరోపించారు. చంద్రబాబు మంచి హీరో అనుకున్నానని.. చంద్రబాబు జైలుకెళ్లాక ఆయనపై 60 కేసులున్నాయని తెలిసిందని అన్నారు. 60 కేసులున్నాయి కాబట్టే.. మళ్లీ జైల్లో పెడతారానే భయంతో చంద్రబాబు అమిత్ షాను కలిశాడని కేఏ పాల్ ఆరోపించారు.

# జనంలోకి జనసేన..!

- టూర్ కు సిద్ధమవుతున్న పవన్ కల్యాన్
- మూడు దశల్లో ఎన్నికల కార్యచరణ
- జనసేన, టీడీపీ నేతలతో సభలు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ రాజకీయ యాత్రలకు మళ్లీ రెడీ వన్ టూ త్రీ అనబోతున్నారు పవన్ కల్యాణ్. మూడు దశల్లో ఎన్నికల కార్యాచరణకు ఆయన సిద్ధం అవుతున్నారు. మొదటి దశలో పొత్తుకు పార్టీ కేడర్‌ను సిద్ధం చేస్తారు. రెండో దశలో పార్టీ ఎన్నికల వ్యూహంపై కేడర్‌కు దిశానిర్దేశం చేస్తారు. ఇక మూడో దశలో ప్రచార సభల్లో ఎన్నికల శంఖారావం పూరిస్తారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. ఏపీలో రాబోయే ఎన్నికల సమరానికి సిద్ధం అవుతున్నారు. అయితే ఈసారి మూడు దశల్లో పవన్ కల్యాణ్ పర్యటనలు ఉంటాయని చెబుతున్నారు. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. పొత్తుల నేపథ్యంలో మొదటి దశలో జనసేన, టీడీపీ లీడర్లు కేడర్‌ను సమన్వయం చేస్తారు. ఇక రెండో దశలో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేడర్‌కు దిశానిర్దేశం చేస్తారు. ఇక మూడో దశలో ఎన్నికల ప్రచార భేరి మోగిస్తారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్.. రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలకు సిద్ధం అవుతున్నారు. పొత్తులో భాగంగా టీడీపీ, జనసేన నేతలతో నియోజకవర్గాల వారీగా వరుస సమావేశాలు చేపట్టనున్నారు పవన్. ఈ ఎన్నికల కార్యాచరణను ఉభయ గోదావరి జిల్లాల నుంచి ప్రారంభించబోతున్నారు. రెండు పార్టీల నేతలు క్షేత్ర స్థాయిలో కలిసి వెళ్ళేలా పవన్ కళ్యాణ్ నేరుగా రంగంలోకి దిగబోతున్నారు. ఇప్పటికే సీట్ల సర్దుబాటుపై రెండు పార్టీల మధ్య పలు నియోజకవర్గాల్లో వరుసగా వివాదాలు, విభేదాలు తెర పైకి వస్తూ ఉండడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారని సమాచారం. దీనిలో భాగంగా పవన్ తొలి దశలో టీడీపీ, జనసేన పార్టీల నేతలతో భేటీ అయి వారి మధ్య గ్యాప్ లేకుండా కలిసి వెళ్ళేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 14 నుంచి 17 వరకు ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించనున్నారు పవన్. మొదట భీమవరంలో, ఆ తర్వాత అమలాపురం, కాకినాడ, రాజమండ్రిల్లో పవన్ పర్యటన ఉంటుంది. ఇక రెండో దశ పర్యటనను పవన్ కల్యాణ్ ఇదే నెలలో చేపట్టనున్నారు. ఆ పర్యటనలో జనసేన పార్టీ ముఖ్య నేతలు, వీర మహిళలు.. పోటీ చేసే నియోజకవర్గాల పరిధిలో పవన్ కల్యాణ్ పర్యటన ఉండబోతోంది.

# మోసం.. దగా.. కుట్రలకు ప్యాంటూ షర్టు తొడిగితే జగన్

- శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో శంఖారావం యాత్ర ప్రారంభించిన నారా లోకేష్
- టీడీపీ అధికారంలోకి వచ్చాక ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని వెల్లడి



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** తెలుగుదేశం పాలనలో ఉత్తరాంధ్రను జాబ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా చేస్తే.. జగన్ అధికారంలోకి వచ్చాక గంజాయి క్యాపిటల్ గా మార్చారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా ఎన్నికల ముందు కొత్త నాటకానికి తెరతీశారని మండిపడ్డారు. మోసం, దగా, కుట్రలకు ప్యాంటూ షర్టు తొడిగితే జగన్ లా ఉంటుందంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఈమేరకు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో 'శంఖారావం' యాత్రను లోకేశ్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర అమ్మలాంటిదని, అమ్మప్రేమకు ఎలా కండిషన్స్ ఉండవో.. ఇక్కడి ప్రజలు కూడా అంతేనని చెప్పారు. పౌరుషాలు, పోరాటాలకు మారుపేరు శ్రీకాకుళం జిల్లా అని అన్నారు. గరిమెళ్ల సత్యనారాయణ, గౌతు లచ్చన్న, ఎర్రన్నాయుడు పుట్టిన గడ్డ ఇది.. ఇలాంటి ప్రాంతంలో 'శంఖారావం' యాత్ర ప్రారంభిస్తుండటం అదృష్టంగా భావిస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి టీడీపీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు 23 వేల పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక 23 వేల పోస్టులు కాస్తా 18 వేల పోస్టులయ్యాయని, ఆపై స్కూలు రేషనలైజేషన్ పేరుతో మరిన్ని పోస్టులు తగ్గించారని లోకేశ్ విమర్శించారు.

# పులివెందులలో టీడీపీ జెండా ఎగురవేస్తాం



- సీఎం జగన్ పై అచ్చెన్నాయుడు విమర్శలు
- టెక్కలిలో టీడీపీ శంఖారావం సభ
- దమ్మున్న నేత నారా లోకేశ్
- రాబోయే ఎన్నికల్లో 175 సీట్లు గెలుస్తాం

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొన్న 'టెక్కలి శంఖారావం సభ'లో ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు కింజ రాపు అచ్చెన్నాయుడు అధికార వైసీపీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. '' జగన్ మోహన్ రెడ్డీ... పులివెందులలో కూడా టీడీపీ జెండా ఎగురవేస్తాం... కాసుకో'' అంటూ హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీకి రాబోయే కాలంలో నాయకత్వం వహించగల దమ్మున్న నేత నారా లోకేశ్ అని ఈ సందర్భంగా అన్నారు. ఒక్క ఫోన్ కాల్‌తో వేల మంది కార్యకర్తలు శంఖారావంలో పాల్గొనేందుకు తరలివచ్చారని ప్రస్తావించారు. ''నా చివరి శ్వాస వరకు టెక్కలి ప్రజలు, ప్రజాసేవకే అంకితమవుతా'' అని పునరుద్ఘాటించారు. అన్న ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన టెక్కలికి తాను ఎమ్మెల్యే కావడం, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిని కావడం తన అదృష్టమని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. '' మీ అందరి సహకారంతో ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. అధికారమంటే ప్రజలకు సేవచేయడం, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం అని భావించాను. చీమకు కూడా హాని తలపెట్టకుండా సేవలు అందించాను. ఎంతోమంది ముఖ్యమంత్రులు, మంత్రులను చూశాను. 2019లో ఏపీ ప్రజలు దగా పడ్డారు. ఒక్క అవకాశం పేరుతో ఒక దుర్మార్గుడిని రాష్ట్రప్రజలు ముఖ్యమంత్రిని చేశారు. ఇది ముమ్మాటికీ ప్రజలు చేసిన తప్పిదమే. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని లక్ష కోట్లు దోచి, 16నెలలు జైలులో ఉన్న దొంగకు ఓటేయడం ప్రజలు చేసిన తప్పే. మన పార్టీ లేకుండా చేయాలని తప్పుడు కేసులు పెట్టి అక్రమ అరెస్టులు చేశారు. జైలులో పెడితే పారిపోతామనుకున్నారు. తెలుగుదేశం పార్టీ గాలికి పుట్టలేదు, పేదవాడి ఆకలి కేకల నుంచి పుట్టింది'' అని అన్నారు .ఈ రోజు చెబుతున్నా... రాష్ట్రంలోని 175 స్థానాలను రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుంది. ఐదేళ్లు రాష్ట్రానికి అన్యాయం చేసిన వాడికి ప్రజలు ఏవిధంగా ఓట్లు వేస్తారు? సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు. బటన్ నొక్కి రూ.2.5 లక్షల కోట్లు పేదలకు ఇచ్చానంటున్న జగన్... అప్పుగా తెచ్చిన రూ.12 లక్షల కోట్లు ఏం చేశాడు?. రాబోయే ఎన్నికల్లో ఓడిపోతాననే బెంగతో నేను పేదవాడినంటూ కొత్తరాగం అందుకున్నాడు. సాక్షి పేపర్, టీవీ, బెంగుళూరు, హైదరాబాద్, తాడేపల్లి ప్యాలెస్‌లు ఎవరివి?. రూ.500 కోట్లతో రుషికొండలో కట్టిన ప్యాలెస్ ఎవరిది?. రాజధాని అంటే ఉత్తరాంధ్ర ప్రజలు మరోమారు మోసపోయి ఓట్లు వేస్తారనుకున్నాడు జగన్. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు జగన్‌కు కర్రు కాల్చి వాతపెట్టారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో 34స్థానాలను కలుపుకుని టీడీపీజనసేన కలిసి 160 స్థానాలు గెలుస్తాయి. 201419 మధ్యాకాలంలో టెక్కలి నియోజకవర్గానికి స్వర్ణయుగం, ఎవరూ చేయనంత సంక్షేమం చేశాను. అర్ధరాత్రి ఒంటి గంటకు ఫోన్ చేసినా ప్రజల కష్టాలు విన్నాను. ఈ రోజు నుంచి 60 రోజులు టెక్కలి కార్యకర్తలు కష్టపడండి. 50 వేల మెజారిటీతో టీడీపీని గెలిపించండి'' అని అచ్చెన్నాయుడు కోరారు.

# చిన్న ఇల్లు.. రూ. లక్షల్లో కరెంట్ బిల్లు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు ప్రాంతాల్లో పూరి గుడిసెలకు, బడ్డీ షాపులకు వేలల్లో, లక్షల్లో కరెంటు బిల్లులు వచ్చిన సందర్భాలు ఎన్నో మనం చూసాం.. అయినా సరే ఎప్పటికీ అధికారుల తీరు మాత్రం ఏమాత్రం మారడం లేదు.. రూ.లక్షల్లో బిల్లులు పొందే వారందరూ సామాన్యులే కావడంతో వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు కారణంగా బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాజాగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ పేద కుటుంబానికి లక్షల్లో కరెంట్ బిల్లు వచ్చింది. తప్పిదాన్ని సరి చేయాల్సిన అధికారులు తిరిగి బాధితున్నే డబ్బులు డిమాండ్ చేశారన్న ఆరోపణలతో వారి తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ పక్క కరెంట్ బిల్లు షాక్ మరో పక్క బిల్ కట్టలేదని విద్యుత్ కట్ చేయడంతో అంధకారంలో మగ్గుతున్న బాధితుడు ఏం చేయాలో తెలియక అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామానికి చెందిన పిల్లేం నాగయ్య కూలి పని చేస్తూ జీవనాన్ని గడుపుతున్నాడు. గత ప్రభుత్వ హయాంలో రెండు గదులలో ఓ చిన్నపాటి ఇంటిని నిర్మించుకుని, అందులో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. నాగయ్యకు విద్యుత్ మీటర్ యూనిట్లపై ప్రభుత్వ సబ్సిడీ ఉండడంతో గత కొంతకాలంగా విద్యుత్ బిల్లు చెల్లించడం లేదు. అయితే గతనెలలో విద్యుత్ బిల్లు రూ.1.11 లక్షలు వచ్చేసరికి అది చూసిన నాగయ్య షాక్ కి గురయ్యాడు. దాంతో తనకు లక్షల్లో కరెంట్ బిల్లు వచ్చిందంటూ విద్యుత్ అధికారులను సంప్రదించాడు. అయితే వారు తన సమస్యను తీర్చేందుకు రూ.15 వేలు డబ్బులు డిమాండ్ చేశారని, చివరకు రూ. 10వేలు.. లేక రూ. 5 వేలైన డబ్బులు ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేసినట్లు నాగయ్య ఆరోపించాడు.. తాను అంత ఇచ్చుకోలేనని రూ. 15 వందల నుంచి రూ. 2 వేలు మాత్రమే ఇవ్వగలనని చెప్పినా వినలేదని తెలిపాడు. చివరకు తాను డబ్బులు ఇవ్వడం లేదని.. విద్యుత్ అధికారులు తాను ఇంటిదగ్గర లేని సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయటమే కాకుండా, స్థంభంపై ఉన్న విద్యుత్ వైర్లను తీసుకుని వెళ్లిపోయారని బాధితుడు ఆరోపించాడు.




# ఉద్యమానికి సిద్ధం..!

- ప్రభుత్వంపై ఏపీ ఎన్జీవోలు ఆగ్రహం
- ఉద్యమానికి వెళ్లాల్సిందేనని నిర్ణయం
- సమస్యలు పట్టించుకోని సీఎం జగన్

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** వైసీపీ ప్రభుత్వంపై ఏపీ ఎన్జీవోలు మరోసారి సమర శంఖం పూరించారు. సమస్యలపై ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా సీఎం జగన్ వినడం లేదని ఎన్జీవోలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమానికి వెళ్లాల్సిందేనని వారు నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలో ఆదివారం ఏపీ ఎన్జీవో జేఏసీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించింది. సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేయాల్సిందేనని నాయకత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా ఇన్ని రోజులు కాలయాపన చేస్తున్న సంఘం నేతలు ఎలాంటి చర్యలను ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.సంఘం నేతలు ప్రభుత్వానికి వత్తాసు పలికితే తమ గళం వినిపిస్తామని ఏపీ ఎన్జీవోలు హెచ్చరించారు. డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు, GPF, APGLI బకాయిలను ప్రభుత్వం ఇవ్వకపోవడంపై సమావేశంలో మండిపడ్డారు. IR 30 శాతం ఇవ్వాల్సిందేనని నేతలు స్పష్టం చేశారు. ధర్నాలు, ర్యాలీలు, ఛలో విజయవాడ వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ రోజు ఉద్యమ కార్యాచరణ ప్రకటించాలని ఏపీ ఎన్జీవోలు నిర్ణయం తీసుకున్నారు

# స్మశాన వాటికలో ఎన్నికల ప్రచారం

- తిరుపతి జిల్లాలో దొంగఓట్లపై వినూత్న నిరసన
- బోగస్ ఓట్లను తొలగించాలని టీడీపీ నిరసన
- అధికారులు స్పందించాలని డిమాండ్



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాష్ట్రంలో మరో ఒకటి, రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. అందుకు సంబంధించి ఇప్పటికే తొలి దఫా ఓటర్ల జాబితా కూడా ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఏపీలో ఐదు కోట్ల పైచిలుకు ప్రజలు ఉంటే.. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితా ప్రకారం.. 4 కోట్ల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. దీనిపై.. టీడీపీ, జనసేన పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తిరుపతి జిల్లాలో దొంగఓట్లపై వినూత్న నిరసన వ్యక్తం చేశారు ప్రతిపక్ష పార్టీల నేతలు.ఒకవైపు దొంగ ఓట్లపై ఈసీ కొరడా జులిపిస్తుంటే విపక్షాల నిరసన వినూత్న రీతిలో కొనసాగుతోంది. చంద్రగిరిలో దొంగ ఓట్లపై తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల సుధా యాదవ్ వినూత్న రీతిలో నిరసనకు దిగారు. చంద్రగిరి నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో దొంగ ఓట్లు నమోదు జరిగినట్లు ఇప్పటికే ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు కూడా అందాయి. అయితే ఈ మధ్యనే విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలోనూ చనిపోయిన వారికి ఓట్లు ఉన్నట్లు గుర్తించిన నేతలు అధికార యంత్రాంగం తీరును తప్పుపడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా నుంచి చనిపోయిన వారి ఓట్లను ఇంకా తొలగించకపోవడంతో చంద్రగిరి స్మశానం వాటిక వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు సుధా యాదవ్. చనిపోయిన వారి సమాధుల వద్ద ప్రచారంలో భాగంగా వాల్ క్లాక్, కుక్కర్లు ఇచ్చి తనుకు ఓటే వేయాలని కోరారు. చంద్రగిరి నుంచి టీడీపీ టికెట్‌ను ఆశిస్తున్న బిసి నేత బడి సుధా యాదవ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

# కృష్ణా జలాలపై రేపు అసెంబ్లీలో క్లారిటీ ఇస్తం

- రాష్ట్ర ప్రభుత్వ విప్‌బీర్ల అయిలయ్య
- సెంటిమెంట్ రగిల్చేందుకు కేసీఆర్ డ్రామాలు
- ప్రాజెక్టుల్లో దోచుకుని.. పంచినా ప్రజలు బుద్ధిచెప్పిన్రు



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** కృష్ణా జలాలపై రేపు అసెంబ్లీలో క్లారిటీ ఇస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేపు అసెంబ్లీలో మా ప్రశ్నలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలన్నారు. ఎల్లుండి కేసీఆర్ మీటింగ్ స్టార్ట్ అయ్యేలోపు తెలంగాణ ప్రజలకు నిజాలు చెప్తామని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నీళ్లను జగన్ కోసం ఏపీకి తరలించారని, సెంటిమెంట్ వాడుకుందామంటే ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. ఏపీకి నీళ్ల విషయంలో కేసీఆర్ సాయం చేశారని జగన్ అసెంబ్లీ లో చెప్పారని, కేసీఆర్ టీమ్ కి బుద్ధి చెపుతామన్నారు. సెంటిమెంట్ రగిల్చి ఓట్లు కొల్లగొట్టడంలో కేసీఆర్ దిట్ట అని ఆయన మండిపడ్డారు. ఎన్నికల్లో ఓట్ల కోసం పోలింగ్ రోజు డ్రామాలు చేశారని బీర్ల ఐలయ్య అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నిధులు దోచుకొని ఎన్నికలకు వాడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.అనంతరం ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. జగన్‌తో కుమ్మక్కు తెలంగాణ నీటిని ఏపీకి దారాదత్తం చేశారని, నీళ్ల విషయంలో తెలంగాణకు ఏపీలో జరిగిన అన్యాయం కంటే కేసీఆర్ చేసిన అన్యాయమే ఎక్కువ అని ఆయన అన్నారు. కృష్ణా జలాలపై జరుగుతున్న ప్రచారాన్ని రేపు తిప్పి కొడతామని, నీళ్ల విషయంలో బీఆర్ఎస్ నాయకులు అన్ని అబద్ధాలు చెపుతున్నారన్నారు. ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్లు కేసీఆర్ లూటీ చేశారని ఆయన అన్నారు. తర్వాత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణకి ఉమ్మడి పాలకులు చేసిన అన్యాయం కంటే కేసీఆర్ చేసిన అన్యాయమే ఎక్కువ అని, జగన్ కేసీఆర్ మాట్లాడుకున్న తర్వాత నాగార్జున సాగర్ పైకి పోలీసులు వచ్చారన్నారు. జగన్ కేసీఆర్ కలిసి నాటకాలు ఆడారని, కేసీఆర్ చేసిన పనుల వల్ల దక్షిణ తెలంగాణా భవిష్యత్తులో ఎడారిగా మారే అవకాశం ఉందన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే కేసీఆర్ కృష్ణా జలాలపై పోరాటం అంటూ డ్రామా మొదలు పెట్టారని ఆయన అన్నారు.

# తెలంగాణ' మీద రేవంత్ కుట్ర

- కాకతీయులు పేదల కోసం పనిచేశారు
- చార్మినార్, కాకతీయ తోరణం తొలగిస్తారా?
- గొలుసు కట్టు చెరువుల చరిత్ర రేవంత్‌కు తెలుసా?
- బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్



**విశాలభారతి,హైదరాబాద్:** కేబినెట్‌లో చర్చించి రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడాన్ని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తప్పుపట్టారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలిగించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో టీఎస్‌టీఎస్సీ మాజీ చైర్మన్ చిరుమల్ల రాజేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ రాచరిక చిహ్నాలని సీఎం హోదాలో రేవంత్ రెడ్డి మాట్లాడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కాకతీయులు 11, 12వ దశాబ్దాల్లో యావత్ దక్షిణ భారతదేశాన్ని పరిపాలించారని, కాకతీయులు రాచరిక వ్యవస్థ నుంచి వచ్చిన వాళ్లు కాదని, పేదల కోసం పని చేసిన వారన్నారు. గొలుసుకట్టు చెరువుల చరిత్ర రేవంత్ రెడ్డికి తెలుసా? అనిప్రశ్నించారు. కాకతీయుల కాలంలో తెలంగాణలో గొలుసుకట్టు చెరువులతో పాటు రామప్ప, పాకాల, లక్నవరం, ఘనపూర్, సింగసముద్రం, నల్లగొండ జిల్లాలో పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్‌తో పాటు వేలాది చెరువులు, కుంటలను నిర్మించారని గుర్తు చేశారు. వాటి ఫలితంగానే నేడు తెలంగాణలో వ్యవసాయం కొనసాగుతున్నదన్నారు. తెలంగాణ వచ్చాక పదేండ్లలో కేసీఆర్ చెరువులు, కుంటలను మిషన్ కాకతీయ ద్వారా అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. కాకతీయులు అనగారిన బీసీ కులానికి చెందిన వారుగా చరిత్రకారులు చెబుతుంటారన్నారు. 800ఏండ్ల కాకతీయుల చరిత్రకు నిదర్శమైన కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తామమంటూ సీఎం ఆలోచన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సారనాథ్ స్థూపంపై ఉన్న మూడు సింహాలు, అశోక చక్రం చిహ్నాలను భారత దేశ చిహ్నంలో తీసుకున్నారని.. మరి అవి రాచరిక వ్యవస్థకు సంకేతం కాదా? అంటూ నిలదీశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వ్యవసాయాన్ని, తెలంగాణ భాషను, యాసను, తెలంగాణ చరిత్రను తుడిచివేయాలని ఆంధ్రాపాలకులు అనుకున్నారన్నారు. ఇప్పుడు సీఎం తీరును చూస్తుంటే తెలంగాణ చరిత్రను కనుమరుగు చేయాలని భావిస్తున్నట్టున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఆయన ఇంకా తెలుగుదేశం నుంచి వచ్చిన లక్షణాలు పోయినట్లు అనిపించడం లేదన్నారు. సీఎం హుందాగా ఉండాలి కానీ.. ఎవరో చెప్పిన వాటిని నమ్మి ఇలా ప్రవర్తించడం ఏమిటన్నారు.తమిళనాడు, త్రిపుర వంటి రాష్ట్రాల్లో టీజీ అనే పేరు ఉండడం వల్లే తెలంగాణ స్టేట్ (టీఎస్)గా గత ప్రభుత్వం మార్చిందన్నారు. కాకతీయులు పాలించిన ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కొండా సురేఖ, సీతక్క మంత్రులుగా ఉన్నారని.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వారు స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెనకి తగ్గకుంటే ప్రజలను, యువతను ఏకంచేసి ఉద్యమిస్తామన్నారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ గుర్తుల గురించి కేబినెట్‌లో చర్చకు వస్తే మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటిశ్రీనివాస్ రెడ్డి, తుమ్మలనాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తిరస్కరించాలని కోరారు.



# కాంగ్రెస్ మాటలు కోటలు దాటుతాయ్

- పనులు వారి ఆఫీస్ కూడా దాటవు
- విద్యారంగానికి నిధులు తగ్గిస్తే ఎలా?
- స్కూళ్లలో టాయిలెట్లు, తాగునీళ్లు లేవు
- హాస్టళ్లలో ఫుడ్ బాగోలేక ఇబ్బంది పడుతున్నారు
- విద్యార్థుల ఆత్మహత్యలు జరగకుండా చూడాలి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**విశాలభారతి,హైదరాబాద్:** కాంగ్రెస్ నాయకుల మాటలు కోటలు దాటుతయి తప్ప.. పనులు వారి ఆఫీసు కూడా దాటవని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. విద్యావ్యవస్థ మెరుగు పరిచేందుకు సరిపోను నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ లోని సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధి మోండా మార్కెట్, రాంగోపాల్ పేట్, బేగంపేట్, అమీర్ పేట డివిజన్ లో ఎంపీ ల్యాడ్స్‌తో ఏర్పాటు చేసిన పవర్ బోర్లను ఆదివారం కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ బడ్జెట్ ను కేటాయించిందని ఆయన విమర్శలు చేశారు. స్కూళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, హాస్టళ్లలో కలుషిత నీరు తాగడం, ఆహారం తినడం వల్ల ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట విద్యార్థులు అస్వస్థతకు గురవుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరగకుండా చూడాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన కొద్దిపాటి నిధులతో బడుల్లో కనీస వసతులు కల్పించడం వీలు కాదని ఆయన తెలిపారు. సర్కారు బడుల్లో టాయిలెట్లు, తాగేందుకు మంచినీళ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడితే.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయిస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం నిధులు ఇచ్చినా.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించిందని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ లో మైనార్టీ విద్యార్థుల కోసం కేంద్రం హాస్టల్ మంజూరు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం మూడేండ్ల నుంచి భూమి కూడా కేటాయించడం లేదని మండిపడ్డారు. సుమారు 23 హాస్టళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నట్లు వెల్లడించారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి అనేక విషయాల్లో సహకరిస్తున్నా.. కేంద్ర నిధులను గత సర్కారు సద్వినియోగం చేసుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మార్పు వస్తుందని తాము అనుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ గత చరిత్ర అవినీతి చుట్టూ, కుటుంబాల చుట్టే ఉన్నది తప్పా.. ప్రజలకు న్యాయం చేసే నైజం ఆ పార్టీ డీఎన్ఏలోనే లేదని ఆరోపించారు. మాటల గారడి తప్ప బడ్జెట్లో పేదలకు జరిగిన మేలు ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు.



# మహిళలకు ఉపాధినిచ్చే ఆర్థిక కార్యక్రమాలు చేపట్టాలి

- మహిళలకు భరోసనిచ్చే ఉపాధి కార్యక్రమాలు చేపట్టాలి.
- పేద మహిళలకు చేదోడువాదోడుగా ఆర్థిక పురోగతికి తోడుబాటును అందించడమే మా లక్ష్యం.
- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.



**నల్గొండ,విశాల భారతి:** ఆదివారం మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నల్గొండ జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో మహిళలకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన వివిధ వ్యర్ధాలతో రూపొందించిన చేతి ఉత్పత్తులశిక్షణ ప్రదర్శనను ప్రారంభించారు . ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పురుషుల సంపాదన ఒక్కటే కుటుంబానికి సరిపోదని, అందువల్ల మహిళలు ఆదాయం ఇచ్చే ఉపాధి కార్యక్రమాలలో పాల్గొనాల్సిన అవసరం ఉందని అన్నారు. పేదలకు చేదోడుగా నిలిచి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో వివిధ వ్యర్థాలతో ఉత్పత్తుల తయారీలో వారి నైపుణ్యలను అభివృద్ధి చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చేసే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకుల కోసం అన్ని రకాల శిక్షణ కార్యక్రమాలను ఇచ్చి వారిలో నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు 30 కోట్ల రూపాయలతో నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన పనులకు ఇటీవలే శ్రీకారం చుట్టడం జరిగిందని చెప్పారు.అలాగే నియోజకవర్గంతో పాటు, జిల్లాలోని మహిళలందరికీ ప్రత్యేకించి స్వయం సహాయక మహిళలకు వివిధ వస్తువుల తయారీలో నైపుణ్య అభివృద్ధికై తనతో పాటు, ప్రభుత్వపరంగా,అలాగే దాతల సహకారంతో ఆదాయం వచ్చే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వ్యవసాయ వ్యర్థాలతో టీ కప్పులు తయారుచేసే మిషన్ కు అవసరమైన 15 లక్షల రూపాయలను తన సొంత నిధుల నుండి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. టిటిడిసిలో ఏర్పాటుచేసిన ప్రదర్శనలో వివిధ వ్యర్థాలతో మహిళలు తయారు చేసిన సుమారు 20 రకాల వస్తువులు ప్రదర్శనలో ఉంచడం జరిగిందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఉచిత బస్సు ప్రయాణంలో ఇప్పటి వరకు 17 కోట్ల మంది ప్రయాణించడం జరిగిందని తెలిపారు. రెండు నెలల్లో గృహలక్ష్మి పథకాన్ని అమలులోకి రానుందని, మరో 10,15 రోజుల్లో 500 రూపాయలకే ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ల పథకం తీసుకురానున్నమని తెలిపారు .మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్సీ ,ఎస్టీ విద్యార్థినిలకు కొత్త కోర్సులను నేర్పించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు.

జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ మహిళలందరూ స్వయంగా ఆర్థిక కార్యక్రమాలు చేసుకున్నప్పుడే స్వయం సమృద్ధి సాధిస్తారని అన్నారు. జిల్లాలో మహిళా స్వయం సహాయక బృందాల కార్యక్రమాలను చురుకుగా, నిర్వహిస్తున్నామని అయితే ఇంకా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ,ఇందుకుగాను ఒక్కొక్కరు గా కాకుండా గ్రూపుగా ఏదైనా సాధించవచ్చు అని అన్నారు. మహిళలు చేపట్టే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యంతో పాటు, బై బ్యాక్ విధానంలో అమ్మకం చేసేందుకు అనేక కార్యక్రమాలు ఉన్నాయని, గ్రూపుగా మహిళలు కార్యక్రమాలను చేయాల్సిందిగా ఆమె పిలుపునిచ్చారు. జిల్లాలో నిమ్మ, మిల్లెట్స్ లాంటి వాటిపై ఎక్కువ ఉత్పత్తులు చేపడితే వాటికి మంచి మార్కెట్ ఉందని తెలిపారు. డిఆర్డిఓ పిడి కాలిందిని మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలను వివరించారు . స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఆర్డిఓ రవి, మెప్మా పీడీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు . కాగా బెంగళూరు ఆధారిత హెడ్ హోల్డ్ హై అనే సంస్థ మహిళల జీవనోపాదులను పెంపొందింపజేసేందుకు వ్యర్థాలతో చేతి ఉత్పత్తులను తయారు చేసే శిక్షణను ఇవ్వడమే కాకుండా, బై బ్యాక్ పద్ధతిలో కొనుగోలు చేసే కార్యక్రమాన్ని చేపట్టేందుకు ముందుకు వచ్చి ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సుమారు 20 రకాల వ్యర్థాలతో తయారుచేసిన చేతి వృత్తులను ప్రదర్శనలో ఉంచారు



# ముగిసిన పాక్ ఎన్నికల కౌంటింగ్..

**ముందంజలో ఇమ్రాన్**

**విశాలభారతి,వెబ్ డెస్క్:** పాకిస్థాన్ రాజకీయాల్లో తీరని ఉత్కంఠఏ పార్టీకి రాని మాజిక్ ఫిగర్ పాకిస్థాన్ సాధారణ ఎన్నికల తుది ఫలితాలు వెల్లడయ్యాయి. కానీ పాకిస్థాన్ ఎన్నికల సంఘం మాత్రం పక్కా విజేతను ప్రకటించలేదు. అసెంబ్లీలో మొత్తం 336 స్థానాలు ఉండగా రిజర్వ్‌డ్ స్థానాలు 71 పోగా మిగిలిని 265 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పోలింగ్‌కు కొన్ని రోజుల ముందే ఓ అభ్యర్థి మరణించడంలో మొత్తం 264 స్థానాల్లో పోలింగ్ విజయవంతంగా ముగిసింది. ఈ పోలింగ్ తుది ఫలితాలను ఆ దేశ ఎన్నికల సంఘం ఎట్టకేలకు వెల్లడించింది. మూడు రోజుల నుంచి అత్యంత సస్పెన్స్‌గా సాగుతున్న పాక్ ఎన్నికలకు ఎన్నికల సంఘం ప్రకటన శుభం కార్డు వేస్తుందను కుంటే అది మాత్రం జరగలేదు. తుది ఫలితాల్లో ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్‌ఇఇన్సాఫ్(పీటీఐ) ముందంజలో ఉంది. ఈ పార్టీ మద్దతుదారులు 101 స్థానాల్లో గెలిచి మెజార్టీలో ఉన్నారు. ఇమ్రాన్ పార్టీ పీటీఐ ఎన్నికల చిహ్నాన్ని పీఈసీ రద్దు చేయడంతో ఆ పార్టీ నేతలంతా స్వతంత్ర అభ్యర్థులగా పోటీ చేశారు. కాగా పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు చెందిన పాకిస్థాన్ ముస్లిం లీగ్‌నవాజ్ పార్టీ 75 స్థానాల్లో విజయం సాధించి రెండో స్థానంలో కొనసాగుతోంది. మరో మాజీ ప్రధాని దివంగత బెనజీర్ భుట్టో కుమారుడు బిలావాల్ జర్దారీ భుట్టో నేతృత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ 54 స్థానాల్లో గెలిచింది. మిగిలిన ముత్తాహిదా క్వామీ మూమెంట్ పాకిస్థాన్ పార్టీ 17 స్థానాల్లో, మరిన్ని చిన్నచిన్న పార్టీలు మిగిలిన 12 స్థానాల్లో గెలిచాయి. పాకిస్థాన్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 133 స్థానాల్లో విజయం సాధించాల్సి ఉంది. పోటీ చేసిన ఏ పార్టీకి కూడా అన్ని స్థానాలు రాలేదు. దీంతో పాకిస్థాన్‌లో సంకీర్ణ ప్రభుత్వమే రానుందని అందరికీ అర్థమైపోయింది. కాగా ఏఏ పార్టీలు కూటమిగా ఏర్పడతాయి అన్న అంశం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే నవాజ్ షరీఫ్, భుట్టో చర్చల్లో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. వారు కలిసి మిగిలిన చిన్నచిన్న పార్టీలను కూడా తమలో కలుపుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చన్న వాదనలు కూడా పాకిస్థాన్ మీడియాలో జోరుగా జరుగుతున్నాయి.




# ఆటలతో మానసిక ఉల్లాసం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**


**విశాలభారతి ,కొత్తూరు:** నందిగామ మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్ లో గెలిచిన జట్టుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సి డబ్ల్యూ సి ప్రత్యేక ఆహ్వానితులు వంశీ చంద్ రెడ్డి తో కలిసి బహుమతులను అందజేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి నందిగామ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్ వైస్ ఎంపీపీ తులసిరాంరెడ్డి,మండల ప్రెసిడెంట్ జంగా నర్సింహా, సీనియర్ నాయకులు జిల్లెల్ల రాం రెడ్డి,ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, కుమారస్వామి గౌడ్,చంద్రపాల్ రెడ్డి, బీసీ సెల్ ప్రెసిడెంట్ తుమ్మల నర్సింహా, బంట్రపు లింగం, బొమ్మగల నర్సింహా, తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా బొంగు వెంకటేష్ గౌడ్ నియామకం.



**ఎల్బీనగర్ ,విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా (స్పోక్స్ పర్సన్ గా )ఎల్ బి నగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ కి చెందిన బొంగు వెంకటేష్‌గౌడ్ నియమితులయ్యారు. డిసిసి అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి నియమాపకపత్రాన్ని అందజేశారు.పార్టీ అభివృద్ధి కోసం పాటుపడతానని బొంగు వెంకటేష్ గౌడ్ తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలో పార్టీ విజయం కోసం పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రచార కమిటీ కోఆర్డినేటర్గాని నరసింహ గౌడ్ పాల్గొన్నారు.

# ప్రో.ముంద్రా ఆదినారాయణ ఆకస్మిక మృతి




**సికింద్రాబాద్, విశాల భారతి:** ఓయూ రిటైర్డ్ కెమిస్ట్రీ ప్రొపెసర్ ప్రో.ముంద్రా. ఆదినారాయణ ( 73 ), ఆదివారం మృతి చెందారు. శనివారం సాయంత్రం వరకు జనాగం లో జరుగుతున్న మూడు రోజుల చెకుముఖి సంబురాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన రాత్రి అక్కడే హోటల్ లో బస చేశారు.ఉదయం శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండడంతో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అయిన హార్ట్ ఎటాక్ తో మృతి చెందారని వైద్యులు ప్రకటించారు. ఆదినారాయణ జెవివి హైదరాబాద్ నగర అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు గా విశేష సేవలు అందజేశారు. సూర్యాపేట జిల్లా ,కోదాడ నియోజకవర్గ పరిధిలోని నల్లబండ గూడెం గ్రామానికి చెందిన ప్రో.ఆదినారాయణ ఓయూ కెమిస్ట్రీ విభాగం లో ప్రొపెసర్ గా పనిచేశారు.

**పలువురు ప్రొపెసర్స్, జెవివి నేతల నివాళులు**

ఓయూ మాజీ వీసీ ప్రో.ఎస్.సత్యనారాయణ, మాజీ వీసీ ప్రో.తిరుపతి రావు,మాజీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రో.జయ ప్రకాష్,ఓయూ ఔట అధ్యక్షుడు ప్రో.మనోహర్ జెవివి రాష్ట్ర అధ్యక్షుడు ప్రో.కోయ వెంకటేశ్వర్ రావు, వరప్రసాద్, ప్రో.బి.ఎన్.రెడ్డి, శ్రీనాద్, రాజా, లింగస్వామి, డా.అందే. సత్యం, శాస్త్రవేత్త ప్రో. హారబండ .ప్రసాద్ రావు, సత్యం జయరాజ్,రామచంద్రయ్య, నాగరాజు,మల్లయ్య, శ్రీనివాస్ ,పర్వతాలు, లు మృతదేహానికి నివాళులు అర్పించారు.

# బీసీలను విస్మరించిన బడ్జెట్

**జాజుల లింగంగౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2,75,891 లక్షల బడ్జెట్లో 50 శాతం పైగా ఉన్న బీసీలకు కేవలం 8 వేల కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమని పేర్కొన్నారు. సామాజిక న్యాయమే మా ఎజెండా అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనిమిది వేల కోట్ల రూపాయల తోటి బీసీలంత మందికి ఏవిధంగా న్యాయం చేయగలరో చెప్పాలని అన్నారు బీసీలకు సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరారు.

# ప్రోటోకాల్ నిబంధనలు విస్మరించిన రామగిరి ఎంపీడీవో సస్పెన్షన్

**రామగిరి, విశాలభారతి:** ప్రోటోకాల్ నిబంధనలు విస్మరించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన రామగిరి ఎంపిడీఓ ఐ.రమేష్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. కమాన్ పూర్ ఎంపిపి కార్యాలయానికి చెందిన ఎంపిడీఓ ఐ.రమేష్ డిప్యూటేషన్ పై రామగిరి ఎంపీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలలో పాటించాల్సిన ప్రోటోకాల్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఎంపిడీఓ ఐ.రమేష్ తన కార్యాలయ విధుల పట్ల సైతం గౌరవపూర్వకంగా వ్యవహరించడం లేదని గమనించనైనదని, అనేక మార్లు ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ జనవరి 31న జరిగిన కార్యక్రమంలో సైతం శిలాఫలకంలో ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పాత తేదీతో ఉన్న శిలాఫలకం పెట్టి బాధ్యత రహితంగా ఉన్న కారణంగా షోకాజ్ నోటీసులు జారీ చేసిన తర్వాత సదరు ఎంపిడిఓను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపిడిఓపై ఉన్న క్రమశిక్షణ ప్రొసీడింగ్స్ ముగిసే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని, సస్పెన్షన్ కాలంలో సదరు ఉద్యోగి తన అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళవద్దని కలెక్టర్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు



# సేవాలాల్ మహారాజ్ జయంతి సెలవు హర్షనీయం

- ఏళ్లు గడచినా పట్టించుకోని గత పాలకులు
- కాంగ్రెస్ లంబాడ నాయకుడు విజయ్

**మరిపెడ, విశాల భారతి:** ఎన్నో ఏళ్లుగా తమ ఆరాధ్య దైవం, బంజారుల జాగృతానికి, వారిహక్కుల సాధనకు పోరాటం చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరినా గత పాలకులు పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ చొరవ, రాష్ట్ర వ్యాప్త కాంగ్రెస్ బంజార నాయకుల విజ్ఞప్తి మేరకు ఫిబ్రవరి 15వ తేదీన సేవాలల్ జయంతిని అధికారికంగా గుర్తించటం హర్షనీయమని డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండల నాయకుడు విజయ్ నాయక్ అన్నారు. సేవాలాల్ జయంతి నిర్వహణపై ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయటంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ఆర్అండ్బీ అతిథి గృహం ఎదుట మరిపెడ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ల చిత్ర పటాలకు బంజార నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మరిపెడ మండల లంబాడ నాయకులు దస్రు నాయక్, అజ్మీర శ్రీను నాయక్, నెహ్రు నాయక్, శీను నాయక్, విజయ్ నాయక్, నరేష్ నాయక్, మహేష్ నాయక్, సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి అవకాశాలను మెరుగు పరచుకోవాలి

**మత్స్య సొసైటీ అధ్యక్షులు కందుల హనుమంతు**

**రామన్నపేట, విశాలభారతి:** యువత ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని మచ్చ సొసైటీ అధ్యక్షులు కందుల హనుమంతు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో నివసించే రేపాక శ్రీకాంత్ ఏర్పాటు చేసిన హరిహర పుత్ర కూల్ డ్రింక్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సమయాన్ని వృధా చేయకుండా ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే ఆర్థిక స్వలంబన పొందడానికి స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషించాలన్నారు. ఎవరికి భారం కాకుండా ఆర్థిక పరిపుష్టితో ముందుకు సాగాలన్నారు. మంచి ప్రవర్తనను అనుసరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని కుటుంబానికి తోడు పడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పిట్ట మత్స్యగిరి, నాయకులు భావాండ్లపల్లి బాలరాజు, ఆదినారాయణ, కందుల అంజయ్య, భైరబోయిన రమేష్, కందుల శీను, బోళ్ల వెంకన్న, రేపాక పోచమ్మ, యాట భాగ్యమ్మ, ఇందిరమ్మ, కందుల రాములమ్మ తదితరులు



# మహిళలకు చీరల పంపిణీ

**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామంలో హనుమాండ్ల ఝాన్సి రాజేందర్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,పాలకుర్తి నియోజక వర్గ ఇంచార్జీ హనుమాండ్ల ఝాన్సిరెడ్డి ఆదేశాలమేరకు మేడారం శ్రీ సమ్మక్కసారలమ్మ పండుగ సందర్భంగా పాలకుర్తి నియోజక వర్గ ఆడపడుచులకు చీరలను అందజేస్తున్నారు. అందులో భాగంగానే నేడు సింగరాజుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్,గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండ పెద్ద మల్లారెడ్డితో కలిసి మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం సమ్మకసారలమ్మ పండుగ సందర్భంగా పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మహిళామణులందరికి చీరల కానుకలను ఇస్తున్నారని. అన్నారు. కార్యక్రమంలో నల్ల యాదగిరి, పృథ్వీ రెడ్డి, తాళ్లపల్లి వేణు, నల్ల నర్సయ్య, జాటోత్ చంద్రయ్య, మంగ సారయ్య, రచ్చ సోమయ్య, జోగు నరసయ్య, అటికం నర్సయ్య, ఊట్ల శివారెడ్డి, చింతల శ్రీనివాస్, మహిళా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మఠంపల్లి ఎస్సైగా రామాంజనేయులు




**మఠంపల్లి, విశాలభారతి:** మండల నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా రామాంజనేయులు బాధ్యతలు చేపట్టారు. రామాంజనేయులు కోదాడ టౌన్ నుంచి బదిలీ అయినట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అంతేకాకుండా మఠంపల్లి మండలం ఆంధ్రా తెలంగాణ బోర్డర్ ప్రాంతం కావడంతో మత్తు పదార్థాల తరలించే వారిపై కఠినమైన కేసులు వేయడమే కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ బంద్ జయప్రదం చేయండి

**పివైఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగయ్య, రవి**



**ఆత్మకూరు, విశాలభారతి:** రైతులు గ్రామీణ ప్రాంత కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు కార్మిక వర్గ సమస్యల పరిష్కారించాలని, నూతన జాతీయ విద్యా విధానం 2020ను రద్దు చేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంధును జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నల్గొండ నాగయ్య, డి రవి కోరారు. ఆత్మకూరు మండల పరిధిలోని తుమ్మల పెన్ పహాడ్ గ్రామంలో జరిగిన ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) సూర్యాపేట జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల్లో సామాన్యులు వ్యవసాయ కూలీలు, కార్మికులు, కష్టజీవులు బ్రతుకులు దుర్భరంగా తయారు అయ్యాయని సామాన్య ప్రజలు కూలీలు పేదలు బతకలేని స్థితి ఏర్పడింది అని అవేదన వ్యక్తం చేశారు. మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా 16న దేశవ్యాప్తంగా బంద్ జరుగుతుందని రైతులు, గ్రామీణ కార్మికులు, ఉపాధి కూలీలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పి వై ఎల్ జిల్లా నాయకులు బండి రవి, మున్న అశోక్, సురేష్, గిరిబాబు, గణేష్, సుందరయ్య, నాగరాజు, బ్రహ్మం, అనంతరామయ్య, నరేష్, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలతో మోసం




**భద్రాచలం, విశాలభారతి:** పట్టణంలో జరిగిన వినియోగదారుల యదార్థ సంఘటన పై స్పెషల్ ఫోకస్. భద్రాచలం పట్టణంలోని ఎస్బిఐ. బ్యాంకు ప్రక్కన ఉన్న కార్తిక క్లాత్ అండ్ మ్యాచింగ్ సెంటర్ షాపుకి ఇద్దరు మహిళలు కొనుగోలు నిమిత్తం వెళ్లారు. తమకు కావలసిన మ్యాచింగ్ దుస్తులను కొనుగోలు చేశారు. అట్టి కొనుగోలు చేసిన మ్యాచింగ్ బట్టలపై అధిక రేటున విక్రయించిన నేపథ్యంలో వినియోగదారులు రేటును ప్రశ్నించారు. దాన్ని తట్టుకోలేక షాప్ యజమానులు నోటికి వచ్చినట్లు బూతులు తిడుతూ వాళ్లని విచక్షణ రహితంగా ఓ సైకోలా ప్రవర్తించారు. మ్యాచింగ్ వస్తువులపై ఇంత రేటు ఎందుకు అమ్ముతున్నారు. ఇంత ధర ఉండదు కదా అని ప్రశ్నించినందుకు ఇద్దరు మహిళల పైన షాప్ యజమానులు విరుచుకుపడ్డారు. చుట్టూ చూస్తున్న ప్రజానీకం షాప్ యజమానుల తీరును తీవ్రంగా ఖండించారు.

# సభను విజయవంతం చేయాలి

**నాగరాజు రెడ్డి**



**నకిరేకల్, విశాలభారతి:** తెలంగాణలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణ నదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీ కి అప్పగించడాన్ని నిరసిస్తూ బిఆర్ ఎస్ పార్టీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో నల్లగొండ బహిరంగ సభను విజయవంతం చేయాలని చిట్యాల మండల బిఆర్ ఎస్ యూత్ ప్రెసిడెంట్ తుమ్మల నాగరాజు రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించి తెలంగాణకు తీరని అన్యాయం చేసినందున మళ్లీ మన నీళ్ల కోసం మనం పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందని కావున ఈనెల 13 తారీకున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చలో నల్లగొండ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొంటారని కావున ఉమ్మడి నల్గొండ పార్టీ నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# గంజాయి స్వాధీనం

- 5 గురు నిందితుల అరెస్ట్
- కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లాలో గంజాయి సరఫరా, వ్యాపారం చేసే, వినియోగించే వారి వివరాలు అన్ని సేకరించి రికార్డ్ చేశామని,ఇలాంటి నేరాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే చెప్పారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిబ్బందితో పటిష్ఠమైన నిఘా ఉంచి గంజాయి సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నామని,ఇలా గంజాయి సరఫరా చేస్తూ సమాజ భద్రతకు ప్రజల ఆరోగ్యాలకు హనికలించే వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని ఎస్పి హెచ్చరించారు. కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల అలవాట్లు, ప్రవర్తన పై దృష్టి పెట్టాలని, గంజాయి సమాచారాన్ని పోలీసు వారికి, 100 కు సమాచారం ఇవ్వాలని, గంజాయి నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎస్పి కోరారు. ప్రస్తుత కేసు వివరాలను వెల్లడిస్తూగంజాయి త్రాగడానికి అలవాటు పడ్డ ఆరుగురు నిందితులు రెండు సంవత్సరాల నుండి డబ్బులు అక్రమంగా సంపాదించాలనే ఉద్దేశంతో ఒరిస్సా సరిహద్దులో, గుర్తుతెలియని వ్యక్తుల నుండి గంజాయిని కేజీ 4500 రూపాయలకు కొనుగోలు చేసి, సూర్యాపేట చుట్టుపక్కల గంజాయి తాగేవారికి ఎక్కువ ధరకు విక్రయిస్తూ లాభం పొందుతున్నారని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని ఎస్పీ వివరించారు. నిందితులను పట్టుకున్న స్పెషల్ టాస్క్ లో సీఐ రామకృష్ణారెడ్డి, చిలుకూరు ఎస్సై చల్లా శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, నరేష్ నాగేష్, అలీముద్దీన్ లు పాల్గొన్నారు.



# శ్రీధర్ కుటుంబానికి ఆర్థిక సాయం

**చిట్యాల, విశాలభారతి:** ఉరుమడ్ల గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మర్రి శ్రీధర్ కుటుంబానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిన 10వేల రూపాయల నీ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోనేటి యాదగిరి శ్రీధర్ కుటుంబానికి అందజేసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు చెరుకు సైదులు, సోషల్ మీడియా ఇంచార్జ్ పట్ల జనార్ధన్, పందుల గోపాల్, కురుపటి లింగయ్య, మేడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికల ఆత్మహత్యల పై విచారణ జరపాలి



**నూతనకల్, విశాలభారతి:** గురుకుల పాఠశాలల్లో విద్యార్థినిల ఆత్మహత్యలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చిప్పలపల్లి రవి డిమాండ్ చేశారు. ఆదివారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇమాంపేట సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల ఇంటర్మీడియట్ చదువుతున్న సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన దగ్గుబాటి వైష్ణవి అనుమానస్పద మృతి, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇద్దరు విద్యార్థినిల ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. మృతుల కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ఉన్నత పాఠశాల,కళాశాలలో బాలికల సమస్యలపై కౌన్సిలింగ్ కమిటీలను ఏర్పాటు చేసి, సైకియాట్రిస్ట్ లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



# ప్రాణాలకు గ్యారెంటీ కావాలి

- గురుకులాలు వసతి గృహాల్లో ఆత్మహత్యలపై ముఖ్యమంత్రి స్పందించాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్

**సూర్యాపేట, విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న 6 గ్యారంటీలు ముఖ్యం కాదని, పేద బిడ్డల ప్రాణాలకు గ్యారెంటీ కావాలని, గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై ముఖ్యమంత్రి స్పందించాలని బీ ఎస్పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్దిని వైష్ణవి కుటుంబాన్ని ఆదివారం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించి, వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళనలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర క్యాబినెట్ లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ మంత్రులు లేకపోవడం శోచనీయమన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలపై అధికార, ప్రతిపక్ష నాయకులు చర్చించకపోవడం దురదృష్టకరం ఆని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిల ఆత్మహత్యలపై తక్షణమే ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి

**నిద్ర సంపత్ నాయుడు**



**సూర్యాపేట, విశాలభారతి:** భువనగిరి ఎస్సీ హాస్టల్ విద్యార్థులు భవ్య ,వైష్ణవి ల ఆత్మహత్యపై ప్రభుత్వం విచారణకు ఆదేశించి,రోజులు గడవక ముందే సూర్యాపేట జిల్లా ఇమాంపేట గురుకుల కళాశాలలో లో మరొక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. విద్యార్థుల మరణాలపై తక్షణమే విచారణ జరిపించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు డిమాండ్ చేశారు.వరుస ఘటనలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు సీరియస్ గా తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్నో ఆశలతో విద్యాలయాలకు అడుగుపెడుతున్న విద్యార్థులు విగత జీవులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని వైష్ణవి ని హత్య చేసినట్టుగా కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తక్షణమే విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలి,50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.



# సమగ్రంగా విచారణ చేస్తున్నాం

**అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి**

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లా ఇమాంపేట గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వైష్ణవి ఆత్మహత్య చేసుకోవడం పై జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. విచారణ అధికారిగా నియమించబడ్డ ఆయన ఆదివారం కళాశాలను సందర్శించి విచారణ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కేసు పై పోలీస్ శాఖ ద్వారా ఎఫ్.ఐ. ఆర్ చేసి ఇన్వెస్టిగేషన్ చేపట్టడం జరుగుతుందని అలాగే వైష్ణవి పేరెంట్స్ తో మాట్లాడడం జరిగిందని, కళాశాల ప్రిన్సిపాల్ పైచేసిన ఆరోపణలపై విచారణ చేపట్టి విచారణలో దోషులుగా తేలితే చర్యలు తీసుకుంటామని అలాగే సమగ్ర నివేదిక అందిన వెంటనే ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా చూపిన డిమాండ్ లను ప్రభుత్వానికి అందచేసి తగు న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు. కళాశాల తనిఖీలో భాగంగా డి.ఎస్.పి. నాగభూషణం, ఆర్.డి.ఓ కృష్ణయ్య, తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# సెర్ఫ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**కోమటి రెడ్డికి వినతిపత్రం అందజేత**

**నల్గొండ ,విశాలభారతి:** నల్లగొండ జిల్లా సమాఖ్యను రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా సెర్ప్ ఉద్యోగుల జేఏసి ఆధ్వర్యంలో సెర్ప్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యలపైన ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సెర్ప్ నల్లగొండ జిల్లా జేఏసిసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ రాష్ట్ర అధ్యక్షులు ఏపూరి నర్సయ్య,సభ్యులు మోహన్ రెడ్డి, వి.యాదయ్య,నరహరి,భాషపాక చంద్రశేఖర్,మైశేశ్వార రావు,బి.శ్రీనివాస్,వినోద తదితరులు పాల్గొన్నారు.



# 33వ వారం స్వచ్ఛ కాలనీ కార్యక్రమం



**ఆర్మూర్, విశాల భారతి:** ఆర్మూర్ జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమంలో భాగంగా 33వ వారం రోడ్డు నెంబర్ 6లో శ్రమదానం నిర్వహించారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీ వాసులు కలిసి రోడ్డుపై ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించారు. చెత్త కాగితాలను, వ్యర్థాలను కుప్పలుగా పోసి నిప్పటించారు. విద్యుత్ నియంత్రిక పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తను మున్సిపల్ చెత్త బండిలో వేయాలని, రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయొద్దని స్థానికులకు సూచించారు. ఈ సంధర్భంగా కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ కాలనీలో ప్రతి ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహిస్తూ కాలనీని స్వచ్ఛంగా, కాలనీ వాసులను సమైక్యంగా ఉంచడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అన్ని కాలనీలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కాలనీ అధ్యక్షులు గోసికొండ అశోక్, ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకె శ్రీనివాస్, కార్యదర్శి ఎల్.సాయన్న, చింత నరహరి, కె.ముత్తేన్న, ఎర్ర భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నాప్ కు యత్నం

**చిన్నారి అరుపులు వేయడంతో కిడ్నాపర్లు పరారి**



**ఆర్మూర్, విశాల భారతి:** గత కొద్ది రోజులుగా నిజామాబాద్ జిల్లాలో చిన్న పిల్లలను కిడ్నాప్ చేసే ముఠాలు సంచరించడంతో పిల్లల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. నందిపేట్ మండలంలోని జోరుపూర్ గ్రామంలో శనివారం కిడ్నాపర్లను గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మరువకముందే ఆదివారం ఉమ్మెడ గ్రామంలో ఇస్సాపల్లి బుజ్జన్న పెద్ద కూతురుని అంబేద్కర్ చౌరస్తా వద్ద కిరణం షాపులో చాక్లెట్ ఇస్తామని పిలిచారు. దగ్గరకి వెళ్లి చూడగానే ఆటోలో ఒక డ్రైవర్ ఇద్దరు ఆడవాళ్లు ఉన్నారని యువకులకు తెలపడంతో యువకులు పట్టుకునే ప్రయత్నంలో సందుల వెంబడి గాలించగా పరారయ్యారు. పిల్లలను బయటకు పంపించద్దని బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు భూమేష్, రవి యువకులు ప్రజలకు తెలిపారు.



# బిజెపి కార్యకర్తలను ఆదుకుంటా

**ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**



**ఆర్మూర్, విశాల భారతి:** పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తను ఆదుకుంటానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపు బీజేపీ కార్యకర్తల గెలుపు అని.. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఆత్మ స్థైర్యంతో పని చేస్తారని అన్నారు. ఎన్ని బెదిరింపులు పెట్టినా పార్టీలు మారలేదు ప్రలోభాలకు లొంగలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, రాష్ట్ర ఓ బి సి మోర్చ ఉపాధ్యక్షుడు మరంపల్లి గంగాధర్, ఎంపీటీసీ లు సంజీవ్, చిన్న రెడ్డి,మహేష్ పాల్గొన్నారు.

# డిప్యూటీ మేయర్ గా మోతె శ్రీలత శోభన్ రెడ్డి మూడు సం లు పూర్తి.

- పలువురు శుభాకాంక్షలు.
- ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు రూపకల్పన
- అందరికి సేవాలు అందజేసేందుకు నిత్య కృషి.
- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



**సికింద్రాబాద్, విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ గా మోతె శ్రీలత రెడ్డి ఆదివారం మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమెకి బి.ఆర్.ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్ కార్పొరేటర్లు , పార్టీ నేతలు కార్యకర్తలు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్, డిప్యూటీ మేయర్ గా ఫిబ్రవరి 11, 2021 సంవత్సరం నుండి 2024 వరకు మూడు సంవత్సరాల పాటు డిప్యూటీ మేయర్ గా విశిష్ట సేవలు మోతే శ్రీలత శోభన్ రెడ్డి అందజేశారు.అనంతరం మేయర్ మరియు డిప్యూటీ మేయర్ హైదరాబాద్ నగర అభివృద్ధికి చేపట్టిన పలు ఎస్.ఎన్.డి.పి పనులు, చెరువుల దత్తత, మహిళా దినోత్సవం, స్వతంత్ర భారత వజ్రోత్సవం వేడుకలు, మోడల్ గ్రేవ్ యార్డ్ లు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చెరువుల దత్తత, గ్రీన్ సిటీ అవార్డు, బన్సీలాల్ పేట్ స్టెప్ వెల్ పునరుద్ధరణ ప్రాజెక్ట్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఫ్లై ఓవర్స్, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్స్, సమ్మర్ కోచింగ్ క్యాంప్ శానిటేషన్ వర్కర్స్ తో మీటింగ్, జోనల్ లెవెల్ మీటింగ్, సేఫ్టీ హెల్త్ కిట్ ల పంపిణీ, ప్రజా పాలన, ప్రజా వాణి తదితర అంశాలలో పాల్గొన్నారు. లాలాపేట్ లో నిర్మిస్తున్న హైటెక్ స్విమ్మింగ్ పూల్, శుభకార్యాలకు పేద ప్రజలకు అందుబాటులోకి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, లాలాపేట్ ఫ్లైఓవర్ పునరుద్ధరణ, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, నాలా రిమోట్లేషన్, సీసీ రోడ్లు, నాలా రిటైనింగ్ వాల్ లు,నూతన నాగార్జున నగర్ పార్క్ ప్రారంభోత్సవం, గ్రీన్ పార్క్ లేదా ఆక్సిజన్ గా నాగార్జున నగర్ నూతన పార్క్, లాలాపేట్ లోని పురాతన కట్టడాలను కాపాడుకోవడం, మన బస్తీ మనబడి స్కీం లో ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి పరచడం, డివిజన్లోని దేవాలయాలకు అభివృద్ధికై సహకరించడం, కుల మతాలకు అతీతంగా ముస్లిం సోదరులకు రంజాన్ పండుగను పనులను క్రిస్టమస్ పండుగ సందర్భంగా చర్చలకు మరియు మైనారిటీ లకు ప్రభుత్వం తరపున అని రకాల సహాయ సహకారాలు అందించడం తో పాటు గిఫ్ట్స్ పాక్కెట్స్ లకు పేద మైనారిటీ లకు అందించినట్లు పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కి అలాగే తనను నమ్మి ప్రోత్సహించి నడిపించిన మాజీ మంత్రి కేటీఆర్ కి తనకు సహకరించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కి సహకరించిన ప్రతి ఒక్క అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అశేష గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రజలకు తను ఎల్లప్పుడూ మరింత అందుబాటులో ఉంటానని తెలిపారు. అలాగే నూతన ప్రభుత్వానికి అని విధాల సహకరిస్తానని తెలిపారు.



# భక్తిశ్రద్ధలతో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం



**కల్వకుర్తి, విశాల భారతి:** వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం కల్వకుర్తి వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు అధ్యక్షతన భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి అభిషేకం, కుమార్చనలు నిర్వహించారు. అనంతరం హోమం జరిగింది. అమ్మవారిని అగ్నిగుండ ప్రవేశం చేయించారు. వేద మంత్రాలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్, కోశాధికారి శివ జగదీశ్వర్, అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్ల పల్లి శ్రీధర్, ప్రచార కార్యదర్శి మిర్యాల రాజయ్య, వాసశేఖర్, ఉప్పు ఆంజనేయులు, సురేష్, తలకొండపల్లి పిఎసిఎస్ వైస్ చైర్మన్ రవికుమార్, వాసవి క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల్లో ఉనికి కోసం విపక్షాలుఅవకాశవాద రాజకీయాలు

**రంగారెడ్డి డీసీసీ అధికార ప్రతినిధి**

**కల్వకుర్తి, విశాల భారతి:** పార్లమెంట్ ఎన్నికల్లో ఉనికి కోసం విపక్షాలు అవకాశవాద రాజకీయాలు సాగిస్తున్నాయని రంగారెడ్డి డిసిసి అధికార ప్రతినిధి, ఎంపిటిసిల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ప్రజా పాలన ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ ప్రజలకు మరింత చేరువైందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తుందని ఆయన దీమా వ్యక్తం చేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారం కోల్పోయామన్న అక్కసుతో రాష్ట్రంలో బిఆర్ఎస్ నాయకులు కుట్ర రాజకీయాలకు, విష ప్రచారాలకు తెర లేపాన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం, అభివృద్ధి పనులు, పథకాల అమలులో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని బిఆర్ఎస్ నాయకులు భయంతో ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షదాయకమన్నారు.12 శాతం రిజర్వేషన్ల కల్పన విషయంలో బిఆర్ఎస్ గిరిజనులను మోసగించిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇట్టి సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు జాంగిర్ బాబా, నాయకులు రామచందర్ నాయక్, యాదయ్య గౌడ్, మంకీ శ్రీను, రాజేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలకు రూ. 5వేల విరాళం

**రామగిరి,విశాలభారతి:** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు 5 వేల రూపాయల విరాళం అందించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలకు నిధులు కావాలనీ హెచ్.ఎం వేగోళపు సదానందం కోరగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు విరాళన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయునికి అందించారు.



# విద్యారంగాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

- బడ్జెట్లో తీరని అన్యాయం
- గత ప్రభుత్వ ఆనవాయితీగానే కొనసాగింపు

**మంచిర్యాల, విశాల భారతి:** మంచిర్యాల జిల్లా తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగాన్ని విస్మరించి తీవ్ర అన్యాయం చేసిందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.8% మాత్రమే నిధులు కేటాయించిందని, అంటే విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించిందని అన్నారు. గత బడ్జెట్ తో పోల్చినప్పుడు కేవలం రూ.2296 కోట్లు విద్యా రంగానికి పెంచారని మొత్తం బడ్జెట్ తో పోలిస్తే కేవలం1.31 శాతం మాత్రమే పెంచారని అన్నారు. ఇది చాలా తక్కువ బడ్జెట్ అని ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య మాత్రం అభివృద్ధి కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పి కేటాయించింది రూ.500 కోట్లు మాత్రమేనని దానితో ఎలా వీటిని నిర్వహిస్తారని అన్నారు. ఈ బడ్జెట్లో గత ఆరేళ్ల నుండి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ 7200 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని, వాటి విడుదల కోసం నిధులు కేటాయించాలని, గురుకులాలు, కేజీబీవీలు,సంక్షేమ వసతి గృహాలకు గత సంవత్సరం నుండి మెస్ చార్జీలు పెండింగ్లో ఉన్నాయని,వాటి నిధుల గురించి కూడా ప్రస్తావనలేదని అన్నారు. వెంటనే నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య వివరాలు డిమాండ్ చేస్తుందని, లేని పక్షంలో విద్యార్థులను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు.



# కిడ్నాపర్లుగా అనుమానం

**దేహశుద్ధి చేసిన స్థానికులు**

**ఆర్మూర్, విశాల భారతి:** ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రి నగర్ లో కిడ్నాప్ చేయడానికి యత్నించారని ఇద్దరు వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని వారిని చితుకబాదారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని నవీపేట్ బాన్సువాడ ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. కిడ్నాప్ ముఠాలుగా అనుమానంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.




# రామగుండం కమిషనరేట్ లో 12 మంది ఎస్ఐల బదిలీ

**రామగిరి,విశాలభారతి:** రామగుండం కమిషనరేట్ లో 12 మంది ఎస్ఐల బదిలీ చేస్తూ ఐజీ తరుణ్ జోషి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాలేశ్వరంలో పని చేస్తున్న లక్ష్మణ్ రావును పెద్దపల్లికి, పెద్దపల్లిలో పనిచేస్తున్న మహేందర్ ను ములుగు వీఆర్ కు, సుల్తానాబాద్ రెండవ ఎస్సైగా పని చేస్తున్న అశోక్ రెడ్డిని పోత్కపల్లికి, పొత్కపల్లిలో పనిచేస్తున్న శ్రీధర్ ను జూలపల్లికి, జూలపల్లిలో పనిచేస్తున్న వెంకట కృష్ణను రామగుండం వీఆర్ కు, ములుగు వీఆర్గా ఉన్న ఓంకార్ యాదవ్ ను కాల్వ శ్రీరాంపూర్ కు, కాల్వ శ్రీరాంపూర్ లో పనిచేస్తున్న శ్రీనివాసును రామగుండం వీఆర్ కు, తాండూరులో పనిచేస్తున్న రాజశేఖర్ ను మందమర్రి రెండవ ఎస్ఐగా, మంచిర్యాలలో పనిచేస్తున్న రాజేందర్ ను కోటపల్లికి, కోటపల్లిలో పనిచేస్తున్న సురేష్ ను రామగుండం వీఆర్ కు, కమాన్ పూర్ లో పనిచేస్తున్న రాములు ను భీమారంకు, భీమారం లో పనిచేస్తున్న రాజా వర్ధన్ ను రామగుండం వీఆర్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



# కంగ్రాట్స్ సార్..చిరంజీవికి మవీన్ గౌడ్ శుభాకాంక్షలు

**పటాన్ చెరు,విశాలభారతి:** మెగాస్టార్ చిరంజీవికి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డు ఇచ్చి సత్కరించిన సందర్భంగా ఆయనకు ఉమ్మడి మెదక్ జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు జొన్నాడ మవీన్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. మవీన్ గౌడ్ ఆదివారం తన తనయుడు ఇషాన్ గౌడ్ తో కలిసి పద్మ విభూషణ్ చిరంజీవిని జూబ్లీహిల్స్ లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో కలిశారు. పద్మ విభూషణ్ పురస్కారం వచ్చిన సందర్భంగా చిరంజీవికి మవీన్ గౌడ్ శాలువాతో సత్కరించారు. చత్రపతి శివాజీ ప్రతిమను అందజేసి తన అభిమానాన్ని చాటుకున్నారు.





# జై జవాన్ జై కిసాన్ నిధికి త్రివేణి విద్యా సంస్థ,విద్యార్థుల విరాళం

**గవర్నర్ తమిళ సై కు అందజేత**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** జై జవాన్ జై కిసాన్ మద్దతుగా రాష్ట్ర గవర్నర్ తమిళ సై కు త్రివేణి విద్యా సంస్థల యాజమాన్యం,విద్యార్థులు విరాళం అందించారు. ఆదివారం రాజ్ భవన్ లో త్రివేణి విద్యా సంస్థల అధినేత డాక్టర్ వీరేంద్ర చౌదరి,వివిధ విద్యా సంస్థల నుంచి విద్యార్థి ప్రతినిధులు గవర్నర్ డాక్టర్ తమిళి సై ని కలిసి 'జై జవాన్ జై కిసాన్'అంటూ సైనికులకు రైతులకు మద్దతుగా నిలవడం కోసం విద్యార్థుల తరఫున, విద్యా సంస్థల తరఫున విరాళాన్ని చెక్ రూపంలో అందజేశారు.ఈ సందర్భంగా గవర్నర్ తమిళి సై విద్యార్థులు, యాజమాన్యానికి అభినందనలు తెలియచేశారు. విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు.ఈ సందర్భంగా త్రివేణి విద్యా సంస్థలు యాజమాన్యం, విద్యార్థులు వరుసగా మూడోసారి సైనికులకు రైతులకు మద్దతుగా విరాళం అందజేసినందుకు డైరెక్టర్ డాక్టర్ జి వీరేంద్ర చౌదరిని ప్రత్యేకంగా అభినందించారు. త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండే సైనికులను,భారతదేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ఆహారాన్ని ఇతర పంటలను పండించి నిరంతరం కష్టం చేసే రైతన్నలకు మద్దతు తెలియజేస్తూ త్రివేణి విద్యాసంస్థల యాజమాన్యం మరియు విద్యార్థులు వారి సహాయార్థం ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉచిత మెగా వైద్య శిబిరం

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** హఫీజ్ పేట డివిజన్ పరిధిలోని మదీనగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సిటిజన్ హాస్పటల్ సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు .ఈ శిబిరంలో 95 మందికి ఎత్తు,బరువు, రక్తపోటు,షుగర్,పల్స్,దంత పరీక్షలతో పాటు ఈ.సీ.జీ పరీక్షలు చేశారు.ఈ శిబిరంలో డాక్టర్ షకీనా గ్రేసీ (జనరల్ ఫిజిషియన్), డాక్టర్ కృష్ణ (డెంటల్) వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పులవల్ల మానవులు అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం కనుక కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు.ప్రతిఒక్కరు నిత్య వ్యాయామం,మెడిటేషన్, యోగా,ధ్యానము,నడక, కనీసం 40 నిమిషాలు చేయాలన్నారు.సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్, పాలు, పాలఉత్పత్తులు, చేపలు, గ్రుడ్లు,తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకొని, ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు. ఆల్కహాల్, పొగాకు,పొగాకు ఉత్పత్తులు,ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనారోగ్యంగా ఉంటే,అశ్రద్ధ చేయకుండా,వెంటనే వైద్యులను సంప్రదించి, వారి సూచనలు, సలహాలు పాటించి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుమార్ యాదవ్,బీరప్ప, శ్రీను,రమేష్, కిషోర్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వాసణి సాంబశివరావు, జనార్ధన్, అమ్మయ్య చౌదరి, ఉమా మహేశ్వర రావు అలాగే హాస్పిటల్ ప్రతినిధి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# 'కాలనీ అభివృద్ధే లక్ష్యం'

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ న్యూ సుభాష్ నగర్ కాలనీ నూతన సంక్షేమ సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కందాల జయేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.కృష్ణారెడ్డి, జి. వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా పి.వెంకన్న, కోశాధికారిగా ఎస్.రాఘవేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జయేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నందున ఎక్కువ నిధులు తెచ్చే అవకాశాలు కూడా తనకు ఉన్నాయని జయేందర్ తెలిపారు. కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ ప్రశాంత వాతావరణంలో పాత కమిటీ రద్దు చేసి, కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. కమిటీ గౌరవ అధ్యక్షులు ఈ. లక్ష్మారెడ్డి, గౌరవ సలహాదారుడు సూర్య నారాయణ, ఇంచార్జులు డి. లక్ష్మారెడ్డి, ఆర్. సైదులు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నూతన కార్యదర్శులు శ్రీపల్ రెడ్డి, సతీష్ రెడ్డి, జగన్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# సీ.ఎం.రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్ , విశాలభారతి:** నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడా లలిత నగర్ కు చెందిన లావణ్య వెన్నుముక్క సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి ఆ ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం చేశారు. దానికి గాను వారికి 1,50,000(ఒక లక్షయాభై వేల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుందని అన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం. సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగోల్,హస్తినపురం డివిజన్ల అధ్యక్షులు చిరంజీవి,సత్యం చారి లు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**నూతనకల్, విశాలభారతి:** జడ్పీ ఉన్నత పాఠశాల 19911992 పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గుండ్లసింగారం కేడీఆర్ పక్షన్ హాల్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 32 సంవత్సరం లు తర్వాత కలుసుకోవడం అభినందనీయమని అలనాటి ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యల్లారెడ్డి, జాన్, మల్లయ్య, మస్తాన్, జగదీష్, దామోదర్, రామచంద్రయ్య, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సొంత నిధులతో సిసి కెమెరాలు ఏర్పాటు చేసిన కొత్త కిషోర్ గౌడ్

- నిఘా నీడలో పి ఎన్ ఆర్ నగర్ కాలనీ
- కొత్త కిషోర్ గౌడ్ కృషి అభినందనీయం
- సీఐ గోవింద్ రెడ్డి

**మేడిపల్లి,విశాలభారతి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరదిలోని 16వ డివిజన్ పి ఎన్ ఆర్ కాలనీలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీసీ కెమెరాలు శాంతి భద్రతలను కాపాడడంలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి నేరాలను అరికట్టడంలోనూ నేరస్తులను త్వరితగతన గుర్తించి వారికి శిక్ష పడే కార్యక్రమంలో సీసీ కెమెరాలు ప్రధాన భూమిక వహిస్తున్నాయి అని తెలియజేశారు.సీసీ కెమెరాలు ప్రాముఖ్యత తెలియజేస్తూ వాటి ఉపయోగాలను వివరించి స్థానికులకు అవగాహన కల్పించారు కాలనీలో ప్రతి ఒక్కరూ వారి ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ. కాలనీలో సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన కొత్త కిషోర్ గౌడ్ కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, ఎస్ ఐ శివకుమార్, 16వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ దిలీప్ రెడ్డి,కాలనీ ప్రెసిడెంట్ కె అశోక్ యాదవ్, కాలనీవాసులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో మద్యం దందా

- ఎంఆర్పి ధరలకు మంగళం
- 300లకు పైగా బెల్ట్ షాపులు



**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలంలోని రెడ్డి సత్రం నందు తెలుగుదేశం పార్టీ పార్లమెంటు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ అజీమ్ ఆదివారం ఉదయం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మద్యం కొత్త పాలసీ వచ్చిన తర్వాత భద్రాచలంలో మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకే, బెల్ట్ షాపులు కూడా ఎమ్మార్పీ ధరకే మద్యం అమ్మకాలు చేశాయని, కానీ ప్రస్తుతం క్వార్టర్ మద్యంపై రూ.20 రూపాయలు మద్యం షాపులు వారు అధికంగా అమ్మితే, మరో 20 రూపాయలు కలిపి అధిక ధరలకు బెల్ట్ షాపులు మద్యం అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై భద్రాచలం ఎక్సైజ్ సీఐని కలిసి భద్రాచలం మద్యం బెల్టు షాపులు సుమారు 300 ఉన్నాయని, నెలకు రూ.10 లక్షల రూపాయలు వరకు అధికంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, ఒక క్వార్టర్ బాటిల్ పై రూ.20 రూపాయలు అధికంగా వసూలు చేస్తే బెల్ట్ షాపులు మరో రూ.20 రూపాయలు అధికంగా మొత్తం రూ.40 రూపాయ వరకు సామాన్య ప్రజలు వద్దనుండి అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు.



# నల్లగండ్ల వెజిటేబుల్ మార్కెట్ లో "చలివేంద్రం" ప్రారంభం

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివెంద్రాలు దోహదం చేస్తాయని శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని నల్లగండ్ల వెజిటేబుల్ మార్కెట్ లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ కార్పొరేటర్ ని షాలువా కప్పి పూలబొకే ఇచ్చి సన్మానించారు. కార్పొరేటర్ నాగేందర్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మార్కెట్ కి వచ్చే ప్రజలకు, మార్కెట్ చిరు వ్యాపారులకు,దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సాధ్యమైనంత వరకు అన్ని ఏరియాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.అనంతరం వెజిటబుల్ మార్కెట్ అభివృద్ధి చేసేందుకు సాయిశక్తుల కృషి చేస్తానని తెలిపారు. అలాగే మార్కెట్లోని చిరు వ్యాపారులను "ప్లాస్టిక్ ఫ్రీ" నీ పాటించి కాలుష్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ డి.వీరేశం గౌడ్,వైస్ ప్రెసిడెంట్ షేక్ కాజా బాషా,అడ్వైజర్ హబీబ్ భాయి, అడ్వైజర్ రాఘవరావు, షేక్ అస్లాం,శ్రీను,రషీద్,శంకర్, మహమ్మద్ అజీమ్, మహమ్మద్ మొయిస్ లాల, రాజు,రాంచందర్,షైక్ దాదు, సల్మాన్,వెంకన్న,మహేందర్, షరీఫ్,శ్రీపాల్,శ్రీరాములు, ఎస్అర్పి భరత్,శానిటేషన్ డిపార్ట్మెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా బాలయేసు వార్షిక మహోత్సవాలు

- భక్తులకు సందేశమిచ్చిన కార్డినల్ పూల అంథోని
- కమ్మగూడకి వేలాది మంది భక్తుల రాక

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిది కమ్మగూడలోని అద్భుత బాల యేసు పుణ్యక్షేత్రం వార్షిక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం సికింద్రాబాద్ బోయిగూడ నుంచి బాలయేసు తేరు ప్రదక్షిణ మొదలైంది. అనంతరం చర్చ్ లో ప్రార్థనలు జరిగాయి. బాలయేసు మహోత్సవం దివ్య బలిపూజలో హైదరాబాద్ అతి మేత్రాణులు పూల ఆంథోని భక్తులకు తన సందేశాన్నిచ్చారు. శాంతి, ప్రేమ సమాజానికి అవసరమని బాలయేసు దీవెనలతోనే అవి సాధ్యమని వివరించారు. దివ్య బలిపూజ తర్వాత పతాకం దించడంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో యంజాల విచారణ గురువు, పాస్టర్ ఉడుముల జె. చిన్నపరెడ్డి, పాస్టర్ పి. ఆల్బర్ట్, కౌన్సిలర్లు కొశికే ఐలయ్య, కాకుమాను సునీల్, నారని కవిత శేఖర్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు కాకుమాను మరియమ్మ చిన్నయ్య, బీఆర్ఎస్ నేత పోలిశెట్టి ప్రేమ్ కుమార్, ఆరోగ్య రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల పాలనకు నిదర్శనం కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రతి సమస్యకి పరిష్కరిస్తా
- శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు.చందా నగర్ భవనిపురం బస్తీలో పర్యటించిన స్థానికంగా ఉన్న సమస్యలపై స్థానిక బస్తి సభ్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రజల పాలనకు నిదర్శనం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని,రంగారెడ్డి జిల్లా మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు దృష్టికి ప్రతి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ మేరకు ఇళ్ల పట్టాలు,అండర్ గ్రౌండ్ డ్రైనేజ,నీటి,సీసీ రోడ్డు సమస్యలు స్థానికులు జగదీశ్వర్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు.వారి సమస్యలు ప్రతి ఒక్కటి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రజల మధ్యనే ఉంటూ మీ సమస్యలను ఒక్కొక్కటిగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సునీత రెడ్డి,శేరిలింగంపల్లి నాయకులు ప్రభాకర్ రెడ్డి,గఫుర్,చందర్ రావు, పోచ్చన్న,సైఫుల్లాహ్ ఖాన్, వేణు,రాము,ఆయాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# తెలుగు తేజాలకు పసిడి పతకాలు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** ఖేలో ఇండియా ఆర్ఈసీ సదరన్ ఓపెన్ టాలెంట్ హంట్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో తెలుగు తేజాలు అదరగొట్టారు. 3537 కేజీల విభాగంలో అబ్దుల్ ఆఫియా జబిన్ గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే 80కేజీల విభాగంలో మహంకాళీ అదిత్య మౌర్య గోల్డ్ మెడల్ సాధించాడు. విజయవాడ ఉయ్యూరుకు చెందిన జబిన్ ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో 7వ తరగతి చదువుతోంది. ఆదిత్య మౌర్య మియాపూర్ వశిష్ట జూనియర్ కళాశాలలో చదువుతున్నాడు. ఈ విజయాలతో ఇరువురు క్రీడాకారులు ఖేలో ఇండియా నేషనల్స్ కి అర్హత సాధించారు. ఈ సందర్భంగా జబిన్, ఆదిత్యకు కోచ్ లు అభినందనలు తెలిపారు.




తమ పిల్లలు సాధించిన గెలుపుతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు




# 'ఈగల్' కు ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చాలా ఆనందాన్ని ఇచ్చింది

### : ఈగల్ పబ్లిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ లో మాస్ మహారాజా రవితేజ


మాస్ మహారాజా రవితేజ స్టయిలీష్ మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్స్ గా నటించారు. ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదలై అన్ని వర్గాల పేక్షకులని అలరించి పబ్లిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకుంది. ఈ నేపథ్యంలో ఈగల్ మేకర్స్ పబ్లిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ ని నిర్వహించారు. పబ్లిక్ బ్లాక్ బస్టర్ ఈగల్ సక్సెస్ మీట్ లో మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్ కు చాలా ఆనందంగా వుంది. నా పాత్ర మేకోవర్ కి చాలా మంచి ప్రశంసలు వస్తున్నాయి. కార్తిక్ ఈ కథ చెప్పినప్పడే ఆ క్యారెక్టర్ కి చాలా ఎక్సయిట్ అయ్యాను. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి అభినందనలు. హరీష్ శంకర్ తో వచ్చే మిస్టర్ బచ్చన్ తో హ్యాట్రిక్ కొడుతున్నాం. డేవ్ జాండ్ సౌండ్ ఇరగదీశాడు. తనకి చాలా మంచి భవిష్యత్ వుంటుంది. అలాగే మణి చాలా పవర్ ఫుల్ మాటలు రాశాడు. తన పద ప్రయోగం చాలా బావుంది. కావ్య థాపర్ పవర్ ఫుల్ క్యారెక్టర్ చేసింది. తనకి బ్రైట్ ఫ్యూచర్ వుంటుంది. కాళికాదేవి ఎపిసోడ్ అయితే నన్ను నేను నమ్మలేకపోయాను. ఎవరినో చూస్తున్న అనుభూతి కలిగింది. చాలా అద్భుతమైన ప్రశంసలు వస్తున్నాయి. కార్తిక్ అద్భుతమైన విజన్ కలిగిన దర్శకుడు. చెప్పినదాని కంటే అద్భుతంగా తీశాడు. తను టాప్ డైరెక్టర్ అవుతాడు. అనుపమ, అజయ్ ఘోస్, వినయ్ రాయ్ అందరూ తమ పాత్రలని పర్ఫెక్ట్ గా చేశారు. సినిమాకి పని చేసిన అందరికీ ధన్యవాదాలు' తెలిపారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. రవితేజ గారితో ధమాకా లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చి ఇప్పుడు ఈగల్ తో బ్లాక్ బస్టర్ ని కొనసాగించాం. చాలా ఆనందంగా వుంది. కార్తిక్ తో మరిన్ని చిత్రాలు చేయబోతున్నాం. సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు' తెలిపారు.



# 'మిస్టర్ బచ్చన్' కీలక షెడ్యూల్ షూటింగ్ పూర్తి

మాస్ మహారాజా రవితేజ, స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్, టాప్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మ్యాజికల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'మిస్టర్ బచ్చన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా టీం ఒక కీలక షెడ్యూల్ ని పూర్తి చేసింది. రవితేజతో పాటు ఇతర తారాగణం పై సినిమాలోని చాలా ముఖ్యమైన సన్నివేశాలని ఈ షెడ్యూల్ లో అద్భుతంగా చిత్రీకరించారు. అనంతరం 'మిస్టర్ బచ్చన్' టీం, మాస్ మహారాజా రవితేజతో కలసి పబ్లిక్ బ్లాక్ బస్టర్ 'ఈగిల్' సక్సెస్ ని సెలబ్రేట్ చేస్తుకున్నారు. రవితేజ పూర్తిగా డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్న ఈ సినిమా ట్యాగ్‌లైన్ 'నామ్ తో సునా హోగా'. ఈ చిత్రంలో రవితేజ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. పనోరమా స్టూడియోస్, టిసిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేస్తున్నాయి.





# ది క్వీన్ ఈజ్ బ్యాక్

సమంత ప్రస్తుతం సినిమాలన్నీ వదిలేసి వెకేషన్ ఎంజాయ్ చేస్తున్న విషయం తెలిసిందే. మయాసైటిస్ వ్యాధితో బాధపడుతున్న సమంత ఒక సంవత్సరం మూవీస్‌కి గ్యాప్ ఇచ్చి చికిత్స తీసుకుంటుంది. ఇక సినిమాలకు గ్యాప్ ఇచ్చినా.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ వెకేషన్, టూర్స్, పోటోషూలట్ పిక్స్ షేర్ చేస్తూ అభిమానులను అనందపరుస్తుంది. ఇక తాజాగా స్యామ్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ చేప్పింది. తాను తీసుకున్న ఏడాది టైం అయిపోయిందని, త్వరాలోనే షూటింగ్స్ మొదలు పెట్టనున్నట్లు తెలిపింది. ఇక ఈ విషయాన్ని ఇన్స్టాగ్రామ్ స్టోరీ ద్వారా తెలిపింది. కొన్ని రోజులుగా అభిమానులు నన్ను ఎప్పడు షూటింగ్లో పాల్గొంటారు అని అడుగుతున్నారు. అయితే ఆ రోజు దగ్గరలోనే ఉన్నాయి. త్వరలోనే నేను షూటింగ్‌లో పాల్గొనబోతున్నాను. ఇన్ని రోజులు జాబ్ లెస్ గా ఉన్నా.. ఇక ఇప్పడు పని చేయాలని చెప్పింది. నా హెల్త్ గురించి నా ఫ్రెండ్స్‌తో కలిసి ఒక పాడ్ కాస్ట్ చేసాం. అది త్వరలోనే రిలీజ్ కానుంది అంటూ చెప్పకొచ్చింది. ప్రస్తుతం స్యామ్ బెబీ చేతిలో సిటాడెల్ వెబ్ సిరీస్ ఉంది. అమెజాన్ లో ఈ సిరీస్ త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. మరి ఈ సిరీస్ తో ఈ అమ్మడు ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# అతడి ప్రేమలేఖ కీర్తి సురేష్ గుండెల్లోనే!


కీర్తి సురేష్ అలియాస్ మహానటి కి బోయ్స్ లో ఉన్న క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. కీర్తి చలాకీతనం..డీసెన్సీ అమ్మ డికి భారీ ఫాలోయింగ్ తెచ్చి పెట్టింది. సాధారణంగా ఈ రేంజ్ ఫాలోయింగ్ హా*ట్ బ్యూటీలకు కనిపిస్తుంది. కానీ కీర్తి బ్యూటీ ముందు! వాళ్లెంతా ఎంత? అంటారు కుర్రకారు. నిత్యం సోషల్ మీడియా కీర్తి ఫోటో కనిపించిదంటే? ఆ క్రింద ప్రపోజల్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. వేలల్లో ప్రపోజల్స్ ఉంటాయి. రకరకాలగా ప్రపోజ్ చేసి తమ ప్రేమని చెప్పే ప్రయత్నం చేస్తుంటారు. ఇవన్నీ ప్రతీ నటి నిత్యం చూస్తూనే ఉంటుంది. మరి కీర్తి కెరీర్ లో డిఫరెంట్ ప్రపోజల్ అంటూ ఏదైనా ఉందా? ఉందనే తెలుస్తోంది. ఆ విషయాన్ని కీర్తి సురేష్ స్వయంగా రివీల్ చేయడం విశేషం. `కొన్నాళ్ల క్రితం నేను నటి అయిన తర్వాత ఓ షాపింగ్ కాంప్లెక్స్ ఓపెనింగ్ కి వెళ్లాను. అప్పటికే నేను వస్తున్నాను అన్న సంగతి తెలిసి అక్కడకి భారీగా జనం చేరుకున్నారు. ఇంతలో ఆ గుంపులో నుంచి ఓఅబ్బాయి ముందుకు దూసుకొచ్చాడు. వస్తూనే అతడు నా చేతిలో ఓ పెద్ద పుస్తకం పెట్టాడు. ఆ సమయంలో నన్ను ఎలాంటి అసౌకర్యానికి గురి చేయలేదు. వచ్చాడు..చేతిలో పుస్తకం పెట్టి వెంటనే అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అ పుస్తకంలో నాకు సంబంధించిన ఫోటోలతో పాటు ఓ ఉత్తరం కూడా ఉంది. తనని పెళ్లి చేసుకోమని ఆ అబ్బాయి రాసిన ప్రేమ లేఖ చూసాను. అందులో తన వివరాలు అన్ని ఉన్నాయి. అబ్బాయి ఫోటో..ఇంటి అడ్రస్..ఫోన్ నెంబర్ అన్నీ ఉన్నాయి. ఆలెటర్ మొత్తం చదివాక షాక్ అయ్యాను. ఆ తర్వాత కాసేపటికి నవ్వుకున్నాను. మొదటి ప్రేమలేఖ కావడంతో ఆ లెటర్ ఇప్పటికీ నా దగ్గర భద్రంగా దాచుకున్నాను. ఎందుకంటే చదువుకుంటున్నప్పుడు ఒక్కరూ కూడా నాకు ప్రేమ లేఖలు రాయలేదు. నా జీవితంలో చూసిన తొలి లవ్ లెటర్ అదే కావడంతో నాకెంతో స్పెషల్ ఆ లెటర్` అని తెలిపింది.

# ఊరు పేరు భైరవకోన' తప్పకుండా అందరికీ నచ్చుతుంది

### : గ్రాండ్ ప్రెస్ మీట్ లో హీరో సందీప్ కిషన్



యంగ్ ట్యాలెంటెడ్ సందీప్ కిషన్ మ్యాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. విఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథా నాయికలుగా నటించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా లావిష్ స్కేల్ లో నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర సగర్వంగా సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులలో హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ చిత్రం ఫిబ్రవరి 16న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్ ప్రెస్ మీట్ ని నిర్వహించింది. ప్రెస్ మీట్ లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ.. ఊరు పేరు భైరవకోన లాంటి అద్భుతమైన చిత్రాన్ని నాకు ఇచ్చిన దర్శకులు విఐ ఆనంద్ గారికి థాంక్స్. దాదాపు రెండున్నరేళ్ళ పాటు ఈ సినిమా కోసం నిరంతరం కష్టప డ్డారు. ఆయన మొదటి సినిమా కూడా నాతోనే చేయడం గర్వంగా భావిస్తాను. అనిల్ సుంకర గారితో ఎంతో మంచి అనుబంధం వుంది. సాధారణంగా నిర్మాతగా ఆయన పేరు వేసుకోరు. కానీ నేను పట్టుపట్టి 'నిను వీడని నీడను నేను' సినిమాకి వేశాను. అది మాకు చాలా కలిసొచ్చింది. రాజా 'హాస్య మూవీస్' నా హోం బ్యానర్ లాంటింది. ఊరు పేరు భైరవకోన చాలా స్పెషల్ మూవీ. ఫాంటసీ, సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ వున్న మంచి కమర్షియల్ తెలుగు సినిమా ఇది. సినిమాపై చాలా నమ్మకంగా వున్నాం. ఈ సినిమాలో పని చేసిన అందరికీ ధన్యవాదాలు. నాకు ఎప్పుడూ అండగా వుండే ప్రేక్షకులకు కృతజ్ఞతలు' తెలిపారు. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ.. ఊరు పేరు భైరవకోన టీం అంతా చాలా హార్డ్ వర్క్ చేసింది. అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. సినిమా చూస్తున్నప్పుడు సందీప్, దర్శకుడు, టీం అంతా పడిన శ్రమ అర్ధమౌతుంది. సినిమా చూశాను. దర్శకుడు ఆనంద్ చెప్పిన దానికంటే చాలా అద్భుతంగా తీశాడు. సినిమాపై చాలా నమ్మకంగా వున్నాం. చాలా మంచి సినిమా ఇది. సందీప్ ఈ సినిమాలో నెక్స్ట రేంజ్ కి వెళ్తాడు. ప్రౌడ్లీ ప్రజెంట్స్ అనే దానికి.. ఐయామ్ ప్రౌడ్' అన్నారు. దర్శకుడు విఐ ఆనంద్ మాట్లాడుతూ.. ఊరు పేరు భైరవకోన అద్భుతమైన జర్నీ. ప్రతి మూమెంట్ మాకు ఓ కొత్త అనుభవం. ఊరు పేరు భైరవకోన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్, సూపర్ నేచురల్ ఫాంటసీ, మంచి లవ్ స్టొరీ వుంది. అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. ఫిబ్రవరి 16న తప్పకుండ అందరూ థియేటర్స్ లో చూడాలి. ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు



# స్వయంభూ కోసం హార్స్ రైడింగ్ నేర్చుకుంటున్న సంయుక్త

హీరో నిఖిల్ తన 20వ చిత్రం స్వయంభూలో లెజెండరీ యోధుడి పాత్రను పోషించడానికి ఆయుధాలు, మార్షల్ ఆర్ట్స్ , గుర్రపు స్వారీలో ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నాడు. అద్భుతమైన వార్ సీక్వెన్సులు ఉండే ఈ సినిమాలో అన్ బిలీవబుల్ స్టంట్స్ చేస్తూ కనిపించనున్నాడు. అతనితో పాటు నటి సంయుక్త కూడా కొన్ని స్టంట్స్ చేయనుంది. అందుకోసం గుర్రపు స్వారీ నేర్చుకునే ప్రయాణాన్ని ప్రారంభించింది. "నా తదుపరి చిత్రం స్వయంభూ కోసం, నేను గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నాను. ఇది అభూతమైన ప్రయాణం. మేమంతా ఒక టీమ్ గా కలిసి పనిచేస్తున్నాం" అని తెలిపింది సంయుక్త. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌పై భువన్ , శ్రీకర్ ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. స్వయంభూ అత్యుత్తమ సాంకేతిక, ప్రొడక్షన్ వాల్యూస్ తో రూపొందుతోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.